# ఇల్లు - ఇల్లాలు

"అసూయ ఆడదాని సహజలక్షణం!" కసిగా అంటూ సిగరెట్ నేలకేసి కొట్టాడు ఆనంద్. "బయట తిరగ వలసిన మగవాడు టైముకు టంచన్‌గా ఇల్లుజేరుకొని హాజరు వేయించుకోలేడు. అడు గడుగునా నన్ను బంధించాలని చూడకు."

"నే నడిగినదేమిటీ?" వివశతనూ, అసహనతనూ సాధ్యమైనంతగా అణచుకుంటూ అడిగింది శ్యామల.

రెచ్చిపోయాడు ఆనంద్. "నువ్వడిగినది ఏదైనా నీ ఆంతర్యం ఏమిటో నేనర్థం చేసుకోగలను. ఇంతవరకూ ఎక్కడున్నానో, ఏమిటో అంతా నీకు సంజాయిషీలూ, సమాధానాలూ చెప్పుకోవాలా నేను?" అంతకంతకూ తారస్థాయినందుకొంటూంది అతడి కంఠం.

క్షణకాలం విహ్వలయై చూచింది శ్యామల. "అంటే మీ ఉద్దేశ్యం? నేను మాట్లాడకూడదనా అసలు మీగురించి? ఇంతాలస్యమైనదేమని కట్టుకున్న భార్య మాటమాత్రంగా అడగడం కూడా భరించలేరూ?" ఆమె స్వరం తీవ్రంగా లేకపోయినా వాడిగావున్నది.

"కట్టుకున్న భార్య అయినంత మాత్రాన అవాకులూ చవాకులూ ప్రేలవచ్చని లేదు. అనవసరంగా మాట్లాడకుండా వుండటం అన్నివిధాలా మంచిది."

శ్యామల బొత్తిగా మౌనం వహించలేకపోయింది. అంతటి మాటను భరించి, "ఔను. అనవసరంగా మాట్లాడక పోవడం ఎవరికైనా మంచిదే!" అతడి మాటనే అతడికి త్రిప్పి కొట్టి విసవిసా అక్కడనుంచి వెళ్ళిపోయింది.

ఆనంద్ అసహాయ కోపమంతా అనేక విధాల ప్రదర్శించసాగాడు. కాలిబూట్లు విప్పి విసురుగా గిరవాటేశాడు ఓ మూలకి. కోటుతీసి మరో మూలకు విసిర్వాడు. అతడు దానిని సోఫాలో పడాలని విసిరినా అదిపోయి ఫ్లవర్ వాజును తాకి, దానిని భళ్ళున క్రింద పడవేసి దాని జీవితాన్ని అంతం చేసింది.

పెద్దవారికి అది ఏమైనా పిల్లలకు మాత్రం తప్పక వినోదకారణమూ, వింతాను.

మూడేళ్ళ రమా, ఏడాది నిండని సుధీర్ సంతోషంగా కేరింతలుకొడ్తూ అక్కడికి జేరారు.

తనకేమీ పట్టనట్లుగా గదిలోకిపోయి పడుకున్నాడు ఆనంద్.

మరొకటీ మరొకటీ అయితే శ్యామలకూడా తనకూ ఆ విషయం అనవసరమన్నట్లుగానే వుండిపోను కానీ, ఏదో గాజువస్తువు పగిలిన శబ్ధమూ, దానివెంట అక్కడ పిల్లలు వినోదిస్తూన్న కలకలమూ వినరావడంతో శ్యామల తిరిగి రంగంలో ప్రవేశించకుండా వుండలేకపోయింది. అక్కడి

దృశ్యం ఆమెకు అరికాలిమంట నెత్తికెక్కించేట్లుగా వున్నది.

ఆ ఫ్లవర్ వాజు తాలూకు గాజు పెంకులను తమతమ చిన్న చేతులతో ఏరి వినోదిస్తున్నారు లోకం తెలియని పసి వాళ్ళిద్దరూ.

"మీరొకళ్ళు, నా ప్రాణానికి." శివమెత్తిపోతూ వాళ్ళను చెరి రెండూ అంటించి దూరంగా తీసింది. సణుగుతూ అవన్నీ ఎత్తిపోసింది.

దిక్కులేని వాళ్ళల్లాగా పిల్లలు కొంతసేపు ఏడ్చి కడకు తమకు తామే ఊరడిల్లారు.

అంతలో శ్యామల మనస్సు 'ఇదీ' అని వర్ణించలేనంతగా అసహ్యపడింది తనపై తానే. 'ఛ. ఏమీ తెలియని —పాలుగారే పసివాళ్ళనా నేను పట్టుకుకొట్టింది? ఎవరిపై చూపించాను?'

తల్లి వచ్చి మరలా తనకుతానే చేరదీయడంతో రమా, సుధీర్ స్వర్గమేదో లభించినంత సంబర పడిపోయారు. వాళ్ళను నెమ్మదిగా నిదురపుచ్చి, భర్త గదిలోకి వెళ్ళింది శ్యామల.

"భోజనానికి రండి." మృదువుగానే పిలిచింది.

కాని ఆ మృదుత్వాన్ని ఆస్వాదించగల స్థితిలో లేడతడు.

"నా కక్కర్లేదు." కోపంగా అటుతిరిగి పడుకున్నాడు.

"ఎందుకనీ?" శ్యామల స్వరంలో సరళత్వం చెదర లేదు.

"ఏమైతే నీకెందుకు? వెళ్ళు. పాపం-నా రాకపోక లతో, నా ఆలస్యాలతో ఇప్పటికే చాలా బాధపడ్తున్నావ్. ఇంక నాకు కూడూ నీళ్ళుకూడా పెట్టి ఏం అలసిపోతావ్ లే!"

అవి మాటలు కాదు, ఈటెలు!

గుణవతి అయిన ఏ ఇల్లాలూకూడా తిరిగి నోరెత్తలేని బాణాలు!

కొద్ది నిముషాలు అలాగే నిరుత్తరగా నిలబడి, నిశ్శబ్దంగా నిష్క్రమించింది అక్కడినుండి.

# 2

"నిద్రానంతరం కూడా అతడి ఆగ్రహం అణగలేదు, ఇసుమంతైనా. భార్య అందించబోయిన కాఫీ కప్పును కన్నెత్తైనా చూడకుండా, రోజూటికంటె త్వరత్వగా వెళ్ళిపోయాడు ఆఫీసుకు. వెళ్తూ వెళ్తూ ఒక్కసారి మెట్లమీద ఆగి పరీక్షగా చూచాడు. పనిమనిషి పెద్దగిన్నెతో ఏమిటో తీసుకుపోతుంది.

"ఏమిటది?" ఆరాగా తీక్షణంగా అడిగాడు.

"అమ్మగారే ఇచ్చారు బాబూ." బెదిరి పోతూ చూసింది పనిమనిషి గిన్నెను.

"రాత్రి ఒంట్లో బాగుండలేదని తమరు అన్నం తినలేదంట గదా! మనసు బాగుండక అమ్మగారూ తినలేదు. మాకేముంది దొరా- సద్దన్నం తింటాం మేం. ఈ సన్నని

బియ్యపు అన్నం, నాజూకు కూరలూ చూసి పిల్లలు పొంగి పోతారు."

"సర్లే, వెళ్ళు వెళ్ళు. వూరికే అడిగాను."

తృటికాలం అతడి మనసు వేదనకు గురైంది. 'వండిన వంట అంతా అలాగే వుంది చెక్కు చెదరకుండా. శ్యామల కూడా ఏమీ తినలేదన్న మాట రాత్రి. నాకేముంది? బజార్లో ఎక్కడో టీ తాగేస్తాను. ఆఫీసులో మధ్యాహ్నం లంచ్ టైములో నేను తీసుకోక పోయినా ఏ స్నేహితుడూ ఊరుకోడు. ఎవరో ఒకళ్లు ఏ హోటల్‌కో లాక్కుపోతారు. శ్యామల అలాగే అభోజనంగా పడుకుంటుందా? పడుకోవటానికి కూడా వీలుపడదే! పిల్లలిద్దరూ హమేషా ఏదో ఒకటి కావాలని రాక్షసులకు మల్లే పీడిస్తూఉంటారు కదా! ఛ. నేనే అనవసరంగా తొందరపడ్డానేమో!... అయినా తనెందుకలా అడుగుతుంది? నేనేమంత చెడిపోయేవాడినా? గాలితిరుగుడు తిరిగే వాడినా? అడుగడుగునా అనుమానంగా చూస్తుంది. అటు భార్యపైన పూర్తిగా ఆగ్రహమూ జెందలేక, ఇటు పూర్తిగా ప్రసన్న హృదయుడూ కాలేక ద్వైదీభావాలతో సతమతం కాసాగాడు.

పిల్లలకు పాలుపట్టి నిద్రబుచ్చి వాళ్ళ పక్కలోనే నీరసంగా వాలింది శ్యామల. భర్త తినకుండా తాగకుండా వెళ్ళిపోయిన ఇంట్లో ఆమెకేమీ తినాలనికాని, కనీసం కాఫీ అయినా తాగాలనికానీ అన్పించలేదు. అసలు వంట చేయటానికే మనస్కరించలేదు. ఆమె అంతరంగం అమితమైన వ్యధకు గురైంది.

"నేనేమయినా అతిగా మాట్లాడేదాన్నా, హద్దుమీరి ఆగడం చేసేరకపు దానినా? భర్త రాకకోసం భార్య ఆరాటం జెందడము అసహజమా? ఆలస్యమైతే ఆతృతను వ్యక్తీకరించడమే నేరమా? భర్త యోగక్షేమాలూ, రాకపోకలూ భార్యకి అనవసరమైతే— అర్థాంగి మాట్లాడే ప్రతి మాటా పురుషుడికి అపసవ్యంగా విన్పించి అసహ్యంగా తోస్తే ఇక ఆ సంసారం వృద్ధిలోని కెలావస్తుంది? ఆ కాపురాని కర్థం ఏమిటి?"

అతడు ముందు భావించినట్లుగానే లంచ్ టైములో శంకరమూ, గోపాలరావూ అతడిని విడిచిపెట్టకుండా తీసుకుపోయారు మెస్‌లో భోజనానికి.

"ఏం గురూ, అంత డీలాగావున్నా వివ్వాళ?" మరో స్నేహితుడు ప్రసాద్ హాస్యంగా అడిగాడు ఆనందరావును.

ఆనంద్ నవ్వుతూనే ఎగర గొట్టటానికి ప్రయత్నించాడు.

అంతలో బాణంలా మరో మూలనుండి దూసుకు వచ్చింది సమాధానం. "ఏమండోయ్, నిన్న పేకాట ఆడి ఆడి గురుడు ఆలస్యంగా యిల్లు జేరుకున్నాడు కదూ! యూ కెన్ గెస్? చిలాకా గోరింకా ఎడముఖం పెడముఖం అయ్యుంటాయి? దట్సాల్."

ఒక్కసారి నవ్వుతో గది దద్దరిల్లిపోయింది:

"ఇటీజ్ నాచురల్!" శంకరం అందుకున్నాడు. "మా ఆవిడా అదే తరహాలే."

"చేతకాని వాజమ్మవు గనుక!" తపీమని కొట్టినట్లుగా అన్నాడు గోపాలరావు. శంకరాన్నుద్దేశించే అతడన్నప్పటికీ అందులో తనపై కూడ ఏదో వ్యంగ్యం గుప్తమై వున్నట్టుగా భావించి ముకుళించుకుపోయాడు ఆనందరావు. ఒకసారి నోరు తెరిస్తే సాధారణంగా మళ్ళీ మూసుకోవటానికి చాలావ్యవధి పడ్తుంది. ఎవరో ఒకరు అడ్డుకొనేవరకూ అలా నిర్మొహమాటంగా నిర్లక్ష్యంగా వాగుతూనే వుంటాడు.

"ఈ ఆడవాళ్ళని— అదే, పెళ్లాలని నోరుమూయించి వుంచడం, అదుపులో పెట్టడం అనేది నిజంగా ఒక కళ. ఏదో పెళ్ళయిన కొత్తలో వాళ్ళ కొంగుపట్టుకు తిరుగుతాం కదాని, యావజ్జీవితం వాళ్లుమనని కొంగునముడివేసుకోవాలని చూస్తారు. ఆ ముళ్ళు తప్పించుకోవటం నిజంగా ఒక 'ఆర్ట్.'

మళ్ళీ పదిమందీ పకపకలాడారు.

ఆనంద్ ముఖం ఆగ్రహాభిమానాలతో అరుణిమ దాల్చింది. "గోపాలం, ప్లీజ్ షటప్ ఫర్ గాడ్స్ సేక్!" తీవ్రంగా అంటూనే భోజనం మధ్యలోనే లేచిపోయాడు.

పకపకలాడుతున్న కంఠాలన్నీ ఒకేసారి ఆగిపోయాయి గంభీర నిశ్శబ్దత ఆవరించింది.

ఆనంద్ మందలింపుతో ఒక్కసారిగా అవాక్కయిపోయిన గోపాలం అంతలోనే తనను తాను సంబాళించుకొని ఒక్కసారిగా ఓ వెకిలినవ్వు నవ్వేశాడు. "సారీ బ్రదర్! నేను నిన్నుద్దేశించి అనలేదు. ఏదో 'ఇన్ జనరల్' అలా అలా సరదాగా మాట్లాడేస్తున్నాను, అంతే" సంజాయిషీ చెప్పుకున్నాడు.

అప్పటికే చెయ్యికడిగేసుకుని వెళ్ళిపోతూన్న ఆనంద్, ఒక్క క్షణం ఆగాడు. "ఐయామ్ ఆల్సో వెరీసారీ. వెరీవెరీ సారీ!" అంటూనే గబగబా వెళ్ళిపోయాడు. అందరూ ముఖ ముఖాలు చూచుకొంటున్నారని అతడికి తెలుసు. 'శ్యామల తిన్నదో లేదో పాపం, చాలా బాధపడ్తూ వుండివుండాలి!' అని అతడు లోలోన తపన చెందుతున్నాడు.

"ఏమిటి బ్రదర్! బొత్తిగా 'మూడ్'లో లేవేమిటి ఇవ్వాళ?" ఇంటికి వెళ్ళిపోయేప్పుడు శంకరం అడిగాడు.

తడబడ్డాడు ఆనంద్. ఏదో ఒకటి చెప్పక పోతే గౌరవం నిలవదు. విపరీతార్థాలు తీసి గుసగుసలు బోయి కథ లల్లుతారు. అందుకే నోటికొచ్చినదీ, మనసుకు తోచినదీ చెప్పేశాడు. "ఏంలేదు. మా అమ్మాయి వంట్లో బాగుండ లేదు. అందుకు నేను బాధపడ్తూంటే ఆ బ్రూట్ ఏదేదో వాగుతాడు. ఏమిటో కోపం నిగ్రహించుకోలేక పోయాను."

నమ్మాడు శంకరం ఆ మాటల్ని. "అయ్యయ్యో. పోనీ ఇవాళ కాజువల్ లీవ్ తీసుకోవల్సింది." అంటూ సాను భూతి కూడా చూపించాడు.

అయితే, ఆ అబద్ధం అంత వెంటనే నిజమైనందున ఆనంద్ నివ్వెరపోయాడు క్షణకాలం. ఇంటికి వెళ్ళేసరికి అప్పుడే డాక్టరు రిక్షా ఎక్కుతున్నాడు.

"ఏమిటి డాక్టర్, ఏమైంది?" ఆత్రంగా అడిగాడు.

"మీ పాపకి జ్వరం. కొంచెం తీవ్రంగానే వుంది. అందుకే మిసెస్ ఆనంద్ గాభరాపడి నాకు ఫోన్ చేశారు. మందు ఇచ్చాను. ఇంజక్షన్ కూడా చేశాను. గాబరా పడ

పడకండి. ఊరంతా ఫ్లూజ్వరాలు విజృంభించి వున్నాయి మరి!"

గడగడా చదివేసి నిష్క్రమించాడు డాక్టర్.

"ఛీఛీ! తనపై తనకే అసహ్యం కలిగింది ఆనంద్‌కు. 'ఛ, ఇంకేమీ కారణం కన్పించనట్లుగా పసిపిల్ల రమ విషయంలోనే అబద్ధం చెప్పాలా? అది ఇంత త్వరలోనే నిజమవ్వాలా?"

రమ నుదిటిపై ఐస్‌బాగ్‌తో కాస్తూన్న శ్యామల ఒక్కసారి కళ్ళెత్తి అతడిని చూచి మరల చూపులు తిప్పేసుకుంది. సుధీర్ కొద్దిదూరంలో నేలమీదపడి మారాముచేస్తున్నాడు దేనికో.

"ఎందుకు నాన్నా?" ఎత్తుకోబోయిన తండ్రిచేతులు తోసేసి, ఏడుపు స్థాయిని మరింత పెంచాడు సుధీర్.

"ఏం కావాలి వీడికి?"

"ఏమీ లేదు. ఎత్తుకోమని". శ్యామల సమాధానం.

"దా బాబూ. నేను ఎత్తుకుంటాను." మళ్ళీ చేతులోకి తీసుకోబోయాడు

"అమ్మేకావాలి" వాడు ఏడుపుతోనే చెప్పాడు.

శ్యామల లేచివచ్చింది. ఒక చేత్తో సుధీర్‌ను ఎత్తుకొని మరొకచేత్తో రమకు సపర్య చేయసాగింది.

"ఏదీ, బాగ్. నేను ఒత్తుతాను. నువ్వు వాడిని చూడు."

ఓ పదినిమిషాలకు రమకు మూల్గు తగ్గింది. నిద్ర పట్టింది. దుప్పటి కప్పి లేచివెళ్ళాడు.

సుధీర్‌ను ఒకచేత్తో ఎత్తుకొని, ఒక చేత్తోనే టీ తయారుచేస్తోంది కమల.

అపరాధిలా నిలబడ్డాడు ఆనంద్. పసిపాప బోసి నవ్వుల్లో, ముద్దుమాటల్లో స్వర్గమే కన్పించుతుందని నానుడి. కాని ఆ పసివాళ్ళని సాకటంలో — సముదాయించటంలో నరకమే చూస్తుంది తల్లి. ఈనరకాన్ని కొద్దిసేపైనా మరిపించ వలసిన వ్యక్తి, బాధనూ బాధ్యతనూ తానుకూడా పంచుకో వలసిన వ్యక్తికూడా ఆమెకు నరకమే రుచిచూపించితే మానసిక స్థితి ఎలా వుంటుంది?

టీ అందుకుంటూ అడిగాడు — "జ్వరం ఎప్పట్నుంచి రమకు? పొద్దున్న బాగానే వుందిగా?"

"నిన్న మధ్యాహ్నంనుంచే మొదలు. ఈ ఉదయం పదిగంటలనుంచీ ఎక్కువైంది."

చర్నాకోలు దెబ్బ తిన్నవాడుకూడా అంత బాధ పడడేమో?

'ఆలుబిడ్డల బాధలూ, అవసరాలూ కనుక్కోనేది పోయి, పైగా యిబ్బంది కలగచేయటానికా మగవాడనేవాడు ఇంటికొచ్చేది?'

కప్పూసాసరూ ఇచ్చేస్తూ అడిగాడు—

"భోజనం చేశావా పొద్దున్న?"

శ్యామల మాట్లాడలేదు. ఒక్కసారి అతడి కండ్లలోకి చూచి, వెళ్ళిపోయి మళ్ళా రమ దగ్గర కూర్చుంది.

ఆ ఒక్క చూపులో వెయ్యి భావాలు!

కొన్ని సంసారాలు నిలడటానికి పిల్లలే కారణం-అనే ఆర్యోక్తి అక్షరాలా నిజమనిపించింది ఆ క్షణంలో.

## 3

అప్పుడే ఆఫీసువదలి బయటకు వచ్చాడు ఆనంద్. వాతావరణం ఆహ్లాదకరంగా వున్నది. చెట్టుక్రింద పార్కు-చేసివున్న స్కూటర్‌ను బయటకు తెస్తూ అనుకున్నాడు ఆనంద్; 'త్వరగా వెళ్ళి, శ్యామలనూ, పిల్లలనూ అలా బయటకు కాస్త వ్యాహ్యాళిగా తీసుకువెళ్ళాలి. రమ జ్వరంతో నీరసంతో పాపం—పదిరోజులనుండీ శ్యామల బందీలా పడి వున్నది యింట్లో.'

బిలబిలా సహోద్యోగులంతా రానే వచ్చారు. ఎవరి వాహనాలను వారు తీసుకుంటున్నారు.

"అప్పుడే ఇళ్ళకుపోయి చేసేదేమిటోయ్? పిల్లల కీచు కీచులూ, ఇల్లాలి బాదరబందీ తప్ప? కాస్సేపలా పార్కు-కు పోయి కూర్చుందాం." శంకరం అన్నాడు.

గోపాలం ప్రభృతులు 'సై' అన్నారు.

"మాట్లాడవేం ఆనంద్, నువ్వూ రా." శంకరం అన్నాడు.

"రానోయ్. ఇంటికి వెళ్ళాలి నేను." ఖచ్చితంగా అన్నాడు.

"ఏం? మీ బేబీ జ్వరం ఇంకా తగ్గలేదూ?" ఒకరిద్దరు

అడిగారు ఆత్రంగా.

"జ్వరం తగ్గిందనుకో. కాని రమతో పాటు నామిసెస్ కూడా చాలా నీరసపడిపోయింది. 'రెస్టు' లేక పిల్లలతో ఒక్కతే అవస్థపడ్తుంటుంది. వెళ్ళాలి నేను."

బోళబోళా నవ్వేశాడు గోపాలం. "మన ఆనంద్ ఈ మధ్య మరీ స్త్రీ పునరుద్ధరణ - అభ్యుదయతా వగైరా లకు కంకణం కట్టుకొన్న ఆదర్శవాదిలా తయారౌతున్నాడు. మనందరికీ లేరూ పెళ్ళామూ పిల్లలూ ఇంట్లో?" మళ్ళీ నవ్వాడు పడి పడి.

మిగిలిన బృందంకూడా చిన్న సృతి కలిపింది.

"ఆఫ్టరాల్! ఇల్లూ, పిల్లల పనే ఆడవాళ్ళది. ఆ మాత్రం వాళ్ళు అలసి పోతున్నారనుకొంటే ఈ ఉద్యోగా లతో మన మెంత అలసి పోతున్నామనుకోవాలి?" అది మరో దేవయ్య ఉవాచ.

"అట్టే నీతిసూత్రాలు వల్లించక, సడవ్వోయ్ నలుగురితోనూ, ఇల్లెక్కడికీ పారిపోదులే, మనం ఎప్పుడు వెళ్ళినా అక్కడే వుంటుంది"

మరలా నలుగురూ వికవికలాడారు.

లోలోన ఎంత అయిష్టంగావున్నా, ఆనంద్ నవ్వుతూ వారిలో కలిసి పోయాడు. తప్పదు మరి! మరీ కాదని తన దారిన తాను వెళ్ళిపోతే, భార్యా విధేయుడనీ, అసమర్థుడనీ ఈ స్నేహితులే చాటున పలురకాలుగా విమర్శిస్తారు. అది అతడి కిష్టంలేదు.

పార్కులో హాయిగా పచ్చికమీదకూర్చుని కొందరు,

పడుకుని కొందరు కబుర్లలో మునిగిపోయారు.

"ఓయ్, అన్నట్టు రేపు మన పండుగ. ఎలా గడుపుదాం." ఉన్నట్టుండి శంకరం అడిగాడు.

"ఏం పండగా?" అర్థంకాక అడిగాడు ఆనంద్.

"అదేలేవోయ్, రెండో శనివారం. ఆఫీసు పని విసుగే అనిపించినా, శలవు వస్తే ఎలా గడపాలా అనేది కూడా సమస్యే."

ఏదో ఘనకార్యం చేస్తూన్నంత దీర్ఘాలోచల్లో పడ్డారు మిత్రబృంద మంతా.

"ఏముందీ? సినిమా చూద్దాం. తర్వాత మన చతుర్ముఖ పురాణం వుండనే వుంది కదా!" శంకరం అన్నాడు.

ఒకరు బాగుందంటే, మరొకరు కాదన్నారు.

చర్చ కొనసాగింది.

"సరే— ఏదైనా పిక్నిక్ వేసుకుందాం" గోపాలం అన్నాడు.

"అబ్బ, పిక్నిక్ అంటే మళ్ళీ భార్యాపిల్లల్ని వెంటేసుకెళ్తే మామూలు తాపత్రయం తప్ప మనకింక మిగిలేదేముందీ? సెలవు రోజున కూడా ఈ బాదర బందీ తెలివైనవాడెవడూ పడడు." కేవలం తిండికీ, నిద్రకూ మాత్రమే ఇంటికి వెళ్తూ మిగిలిన టైమంతా ఊరి వీధులు కొలుస్తూ హోటళ్ళు లెఖ్ఖపెడుతూ గడిపే సోమేశ్వరం అన్నాడు.

అంత వరకూ మౌనంగా పార్కుకు వచ్చే పోయే జనాన్ని చూస్తున్న ఆనంద్ కలుగజేసుకున్నాడు. "మరీ అన్యాయంగా మాట్లాడకు సోమేశ్వరం. మనకి సెలవులు -

పనిరోజులు అని విడిగా వుంటాయి. ఏరోజూ ఏ క్షణమూ కూడా విశ్రాంతీ సెలవూ అనేదే లేని ఆడవాళ్ళ మాటేమిటి సెలవు రోజుల్లో కూడా వాళ్ళ ఖర్మకు వాళ్ళని వదలి; మనం వేరే వినోదమూ ఆనందమూ వెదుక్కోవటంలో అర్థంలేదు, న్యాయం అసలే లేదు.” అతడికి తెలియకుండానే కంఠస్వరం కొంచెం తీవ్రతను పొందింది.

“హాయిగా యింట్లో తిని కూర్చునే వాళ్ళకోసం ఎందు కోయ్ బాధ? నీ వొట్టి తెలివితక్కువ వాడివి?” సోమేశ్వరం అన్నాడు.

“పోనీ తీసుకెళ్ళాం అనుకో!” గోపాలం కల్పించుకుని విషయాన్ని విపులంగా మాట్లాడాడు. “దారి ఖర్చులూ, భోజనాలకి హోటల్ ఖర్చులూ ఇవన్నీ ఎంతెంత అయిపో తాయి? తట్టుకోగలమా?”

“ఖర్చు అవ్వవచ్చు, ఒప్పుకుంటాను. అయితే ఎప్పుడో నూటికీ, కోటికీ ఓసారి జరిగే ఇటువంటి ఖర్చును లెక్క పెట్టుకోవలసినంత హీనస్థితి కాదుకదా మనది? ఈ విధంగా గృహిణికి కూడా ఒక్కసారి విశ్రాంతినీ వినోదాన్నీ కల్పించి వాతావరణం మార్పు చేస్తే, అది అదృశ్యంగా ఎంతటి మార్పును తెస్తుంది, ఆలుమగల మధ్య ఎంతటి సాన్నిహి త్యాన్ని సృష్టిస్తుంది?” అంతా ముఖ ముఖాలు చూచు కున్నారు. ఆనంద్ ధోరణి అంతగా అంగీకారంగా లేనట్లుగా ఆ ముఖకవళికలే చెప్తున్నాయి.

“ఏమో బాబూ! ఈ సెలవురోజున కూడా ‘ఫ్రీడం’ పోగొట్టుకొనేంత ఉదారత లేదు మాకు.” అందరి తరఫునా

తానే వకాల్తు తీసుకున్నట్టుగా అన్నాడు శంకరం "ఆ పసి దాన్ని ఎత్తుకోండి; చిన్నవాడి చెయ్యి కడగండి. నీళ్ళు తెండి. పాలసీసా పట్టుకోండి!" అంటూ దిక్కుమాలి సతాయింపులు ఎవడు భరాయించగలడు? మధ్య తరగతివాడు చూడగల స్వర్గం ఇటువంటి సెలవు రోజుల్లో మాత్రమే వుంటుంది."

"మా మాట వదిలేయ్. నీకు పిల్లల బాదరబందీ లేదు కదా! పోనీ నీతో మిసెస్‌ను తీసుకెల్తావా?" అతని అభిప్రాయ మేమిటో తెల్సుకుందామని ఆరాగా అడిగాడు ఆనంద్ గోపాలాన్ని ఉద్దేశించి.

"నోనోనో!" అంటూనే చికాకు పడ్డాడు గోపాలం. "ఆడవాళ్ళుంటేనే పెద్ద బర్డెన్ వెంట. స్వేచ్ఛ వుండదు."

"చిన్న సవరణ—స్వంత ఆడవాళ్ళైతేనే ఇబ్బంది అంతా! గర్ల్‌ఫ్రెండ్స్ అయినా, ఆఫీసులో టైపిస్టులూ, స్టెనోగ్రాఫర్లూ వగైరా అయితే మళ్ళీ మనకి మంచి రిక్రియేషన్!" తన విట్టుకు పెద్దగా తానే నవ్వుకున్నాడు శంకరం.

"ఛఛ. ఎందుకోయ్ ఈ పనికిమాలిన దారులన్నీ?" మందలించాడు ఆనంద్.

"సెలవురోజు -- లక్షణంగా ఇంటిపట్టున వుండి సాయంత్రం కాస్త భార్యాబిడ్డల్ని బయటకు తీసుకువెళ్ళడం —ఏ పిక్చరో చూపించడం చెయ్యాండి, నేను మాత్రం అదే చేయదలచుకున్నాను" కొంతసేపు నిశ్శబ్దం.

ఉన్నట్లుండి గోపాలం అన్నాడు! "అబ్బే. నేనింతగా భయపడను మా ఆడవాళ్ళకు. నేనెలా ఖర్చుపెట్టుకోనీ. ఏ టైముకు ఇంటికి జేరనీ—నోరెత్తితే ఒట్టు!" ఆనంద్‌కు

అభిమానం కలిగి పౌరుషం వచ్చేటంతగా మాటను మెలిపెట్టి, ప్రసంగానికి క్రొత్తరూపూ, సరికొత్త అర్థాలూ కల్పించాడు.

అతడి అంచనా తప్పలేదు! వింటూనే ఆనందరావు ముఖం జేవురించింది.

"నేను మాత్రం? నేనూ అంతే!" తీసిపోలేదన్నట్లుగా శంకరం మొదలుపెట్టాడు. "మగవాడితో సమంగా ఆడది కూడా తయారైతే అన్నిచోట్లనూ, ఇక సంసారం చేసినట్లే. ఇప్పటికి పదిహేనేళ్ళనుంచి వుంటున్నాను ఈ ఊళ్లో. మావీధీ పక్కవీధీ తప్ప మరొకటి తెలియదు మా శ్రీమతికి. ఇన్నాళ్లనుంచీ ఆమె నేనూ కలసి ఎక్కడికైనా వెళ్ళిన సన్నివేశాలు గానీ, చూసిన సినిమాలు కాని లెక్కపెట్టి చెప్పవచ్చు!"

"ఏడిశావ్ లే, మా ఆవిడమాత్రం గొడవచేస్తుందని చెప్పానా నేను? అది న్యాయం కాదంటున్నాను. అంతే." గోపాలం ప్రభృతులు ఆశించిన మార్పు వచ్చేసిందిఆనంద్ లో. "సరే. ఎన్నింటికి బయలుదేరడం? పిక్నిక్ స్పాట్ ఏది?"

ఆనంద్ లో మార్పు తేగలిగిన వీరుడనన్నట్లుగా సగర్వంగా చూచాడు గోపాలం అందరివైపూ.

## 4

"ఇవాళ శలవు కదా!"

ఉదయమే ఆదరాబాదరాగా తయారౌతూన్న భర్తను ఆశ్చర్యంగా చూస్తూ అడిగింది శ్యామల.

"ఊఁ." నసిగాడు ఆనంద్. సూటిగా భార్యముఖం లోకి చూడలేకపోయాడు. "కొంత అర్జంటు వర్కు పూర్తి చేయవలసి వుంది ఆఫీసులో. డైరెక్టర్సు మీటింగ్ జరిగేరోజు దగ్గరపడ్తోంది. ఆ నాటికి రిపోర్ట్సు సిద్ధంగావుంచాలి.

ఆడది అబద్ధమాడితే గోడకట్టినట్లుంటుందని సామెత.

కాని పురుషుడు పురాతనపు కోటప్రహరీలంత దిట్టంగా అబద్ధం చెప్పగల సమర్థుడయాడీనాడు!

"అయ్యో రాత్రి చెప్పారు కాదేం? సెలవురోజే నన్నట్లుగా ఆలస్యంగా లేచాను." నొచ్చుకుంటూ వంటింటివైపు పరుగెత్తింది. "ఏ హోటల్లోనో త్రాగేస్తాలే. చూడు పిల్లలు లేచినట్లున్నారు. రమ ఏడుస్తోంది."

"వాళ్ళ ఏడుపుల కేం లెండి."

రెండు మూడు నిముషాలు గడిచాయి.

పిల్లల ఏడుపులు తారస్థాయి నందుకుంటూనే వున్నాయి అంతకంతకూ.

త్వరగా తయారై ఆ బంధిఖానా నుండి బయటపడి మిత్రబృందాన్ని చేరుకోవాలనే ఆరాటంలో వున్న ఆనంద్‌ను ఆఏడుపులు అంతగా కదిలించడంలేదు.

"సెలవురోజున కూడా ఆఫీసుకుపోయి గొడ్డుచాకిరీ చేయాలే." అని భర్తకోసం లోలోన వగస్తూ, కనీసం అతడికి తన చేతితో కాఫీ అయినా యిచ్చి పంపాలనే తహతహలో వున్న శ్యామలకు పిల్లల ఏడుపులు విన్పించనేలేదు.

వేడి వేడి కాఫీ త్వరత్వరగా త్రాగుతున్న ఆనంద్ తనవైపే సానుభూతిగా చూస్తున్న శ్యామల ముఖంచూచి

లోలోన చాలా బాధపడ్డాడు. ఏదో నేరం చేస్తున్నట్లుగా మనస్సు మధనపడింది. "నేనేదో విశ్రాంతిలేకుండా శ్రమ పడి పోతున్నానని బాధపడ్తోంది అమాయకురాలు!"

"మరి భోజనంటైముకు వచ్చేస్తారా?"

చెప్పులు తొడుక్కొంటూ ఒక్కక్షణం ఆలోచించాడు.

"చెప్పలేను. నువ్వు చేసెయ్యి. నా కోసం చూడకు."

"అయ్యో. ఆకలితో వుంటారా?"

"వుండనులే. ఏ టైముకు పనౌతుందో తెలియదు. రావటానికే ప్రయత్నిస్తాను. నాకోసం మాత్రం చూడకు. వేళకు నువ్వు తినెయ్యి."

ఒక అబద్ధం తర్వాత ఎన్నైనా అబద్ధాలు ఆడక తప్పదు.

అప్పటికే అతడు గుమ్మందాటి మెట్లు దిగుతున్నాడు.

అయితే, అప్పట్లోవున్న బాధ, మధన మిత్రులను కలిసిన కొద్దిసేపటికే కొంత తగ్గాయి.

అలా మరో రెండుమూడు సార్లు జరిగేసరికి, భార్యాబిడ్డలను వెంటబెట్టుకొని తిరిగేకంటే ఒంటరిగా తిరగడంలో పదిరెట్లు ఆనందం వుందన్పించింది ఆనందరావుకు. ఆనందరావులో ఏదో మార్పు వచ్చినట్లు అనుమానం కలిగింది శ్యామలకు.

ఒకటి రెండుసార్లు ఏ మాటైనా ఎవరైనా నమ్మగలరుకాని, ఎల్లప్పుడూ ఏదో ఒక సాకుచెప్పి ఎంతటి అమాయకులనైనా నమ్మించగలగడం అసాధ్యం.

భర్తలో క్రమక్రమంగా వస్తూన్న పరిణామాన్ని పసి కట్టలేనంత మూర్ఖురాలుకాదు శ్యామల. అయితే, భార్యాభర్తల అనుబంధం ఎంత దృఢమైనదీ బలమైనదో—ఆ సంబంధం అంత సున్నితమైనది కూడా. అందుకే లోలోపల దహించివేసే బాధను భరించుతూ మౌనంగా ఏమీ తెలియనట్లే ప్రవర్తించ సాగిందామె.

## 5

"ఆనంద్ ఏడీ? నిద్రపోతున్నాడేమిటీ?" అంటూ ప్రవేశించిన మూర్తిని చూచి ఆశ్చర్య పడింది శ్యామల.

"నిద్రపోయే తీరికకూడా ఎక్కడ? ఆఫీసులో ఏదో పనుందని వెళ్ళారు. రండి కూర్చోండి." ఎందుకో పేచీలు పెడ్తున్న రమనూ సుధీర్‌నూ చెరో చేతితో ఎత్తుకుని అవస్థ పడ్తూనే అతిథులకు స్వాగతం పలికింది శ్యామల.

మూర్తి విస్మయంగా చూచాడు. "ఆఫీసులో పనా?"

అనుమానం తొణికిస లాడ్తూన్న అతడి స్వరంవిని విస్మయమందడం ఈసారి శ్యామల వంతైంది.

"ఒకవేళ అతడికేమైనా ఎక్కువపని వున్నదేమో!" తన మాటను సర్దుకుంటూ వీలైనంత సాధారణంగా అన్నాడు మూర్తి. కాని అతడితోవచ్చిన అతడి భార్య మాత్రం, పరిస్థితిని ఇంకా క్లిష్టతరం కావించేట్టుగా మాట్లాడింది. "అదేమిటండీ, మీరూ ఆయనా ఒకే సెక్షన్‌లో పనిచేస్తున్నారు

కదా? ఆయనకు పనుండి మీకు లేకపోతుందా?" ఖంగారు పడ్తూ, ఏమీ మాట్లాడలేనట్టుగా చూచాడు మూర్తి శ్యామలదెస. శ్యామల అతడివైపే చూస్తోంది సమాధానం కోరుతూన్నట్లుగా.

మరో దారిలేని మూర్తి వాతావరణాన్ని మార్చ డానికి ప్రయత్నించాడు.

"ఇలారామ్మా రమా, తమ్ముడితోపాటు నువ్వూ అమ్మను శ్రమపెడ్తున్నావా?" అంటూ రమను ఎత్తుకొని కబుర్లలోకి దిగాడు.

అతడి ధోరణినీ మనస్సునూ గ్రహించగలిగిన శ్యామల మరి తర్కించలేదు. అంతరాంతరాలలో అదివరకే మొలకెత్తిన అనుమానాంకురం అప్పటికప్పుడే ఆ క్షణంలోనే శాఖోపశాఖలతో విస్తరిల్లి మహావృక్షమైపోయింది. "ఆఫీసు పనిపంకన ఎక్కడ ఏం చేస్తున్నట్టు తన భర్త?"

ఆలోచిస్తూనే టీ తయారుచేసి తీసుకు వెళ్ళేసరికి మూర్తి సన్నసన్నగా భార్యను మందలించడం విన్పించింది శ్యామలకు. "అనవసరంగా సాగదీస్తావు సంభాషణను. పరిస్థితి ఆ మాత్రం అర్థం చేసుకోవేం?"

"బాగుంది. అతను ఇలా భార్యకు తెలియకుండా దొంగ తిరుగుళ్ళు తిరిగే ప్రవీణుడని నాకేం తెల్సూ?" పెడసరంగా వుంది వనజ జవాబు. "అయినా ప్రతి మొగుడూ పెళ్ళానికి తెలీకుండా అంతో ఇంతో దాస్తూనే వుంటాడట?" అంటూ ఓ విసురు విసిరింది.

"సర్లే. నోర్ముయ్."

శ్యామల మనస్సు పరిపరి విధాల బాధపడింది. "ఓ ప్రత్యేకతా, వ్యక్తిత్వమూ అంటూ లేని అతి మామూలు మనిషి వనజ. అటువంటి వ్యక్తి కూడా విమర్శిస్తూ వాగే టంత అవకాశం కలిగిందా మా మధ్యన."

శ్యామల ప్రవేశంతో భార్యాభర్తల వాదోపవాదాలకు తాళంపడింది. అన్యమనస్కంగా ఏదో మాట్లాడుతూనే వున్నది కాని శ్యామల లోలోపల చాలా బాధపడుతూ అతలాకుతలమాతూన్నది.

ఓ పదినిమిషాలు గడిచేసరికి ఆనంద్ రానేవచ్చాడు. అతడూ మూర్తీ కూడా ఒకరినొకరు చూచుకుని గతుక్కుమన్నారు. ఎవరిమటుకు వాళ్ళే ఏదో పొడిపొడిగా మాట్లాడి పలకరించుకున్నారు. ఇరకాటంలో పడ్డట్టుగా. ఆఫీసు సంగతి పొరపాటున కూడా అతడు ఎత్తలేదు. శ్యామల ఏమీ మాట్లాడలేదు. తన బాధలనూ అనుమానాలనూ తనలోనే అణచిపెట్టగలిగింది తాత్కాలికంగా.

కాని ఎప్పుడేపని చేస్తున్నా అనుక్షణం ఆ అనుమానం మెదడులో వెర్రిగంతులువేసి మతి చెడగొట్టసాగింది. "అతడెందుకు తననుంచి ఏదో దాస్తున్నాడు? ఈ ఇంటిపై రక్తీ ఇల్లాలిపై అనురక్తీ ఎందుకు సన్నగిల్లాయి అతడిలో?" ఈ సమాధానం లేని ప్రశ్న అనుక్షణం ఆమెను తినివేస్తోంది.

భార్య ఏమీ స్పష్టంగా అడగకపోయే సరికి ఆనంద్ మనస్సు చాలా తేలికపడింది. 'హమ్మయ్య! మూర్తి ఏమీ అనవసర వాగుడు వాగినట్లు లేదు? అనుకున్నాడు భారం తీరినట్లుగా. అయితే శ్యామల ముక్తసరి ప్రవర్తన, అంతకు

పూర్వంలేని ఏదో గాంభీర్యతా అతడికి కించిత్ సంకోచం కలిగించగా ఇక సాయంత్రం ఇల్లు కదలకుండా పిల్లలతో ఆడు కుంటూ వుండిపోయాడు.

పిల్లల నవ్వులూ, కేరింతలతో ఆనంద్ దరహాస వద నంతో ఇల్లు కళకళలాడగానే శ్యామల తన మనోవ్యధ నం తనూ తాత్కాలికంగా మరచిపోయింది. కొద్దిసేపటికే ఆమె పూర్వం లాగే నవ్వుతూ, అతడి మాటలకు నవ్వుతూ తుళ్ళుతూ, పూర్వపు శ్యామల అయిపోయింది.

మర్నాడు భర్త ఆఫీసుకు వెళ్ళిపోయి, తాను ఒంట రిగా గృహకృత్యాలలో లీనమైపోయి నప్పుడు మాత్రం తిరిగి నిన్నటి ఆలోచనలు నిద్ర మేల్కొంచినట్లు లేచి లోలోన కుమ్మరిపురుగులా తొలచసాగాయి.

'చ. నాది అనవసర అనుమానం. మగవాళ్ళన్న తర్వాత ఎన్నో పనులుండవచ్చు.' అంటూ తనను తాను మభ్యపెట్టుకో జూచింది.

కానీ మనస్సు వినక ఎదురు తిరిగి ప్రశ్నలు కురిపిం చింది. 'పనే వుంటే ఆపని ఏమిటో స్పష్టంగా చెప్పవచ్చు కదా? ఆఫీసుకని అబద్ధం దేనికి? మిత్రుడు మూర్తి వద్ద అంత దొంగలాగా, పట్టుబడిపోయినట్టు బెదురు బెదురుగా ప్రవర్తిం చడం దేనికి? అతడివద్ద ఆఫీసు ప్రసంగమే రాకుండా ఎందుకు జాగ్రత్త పడినట్టు? 'ఆఫీసుకు వెళ్లారు ఆదివారం కూడా అలసిపోతున్నారు' అని చెప్పి అందరిలో నీవు నగుబాట్లుపాలు కావటం లేదా?'

ఔను. ఈ ప్రశ్నావళితో తిరిగి అగ్ని రాజుకొన్నది.

ఏదైనా సినిమాకి వెళ్ళారేమో! ఇంట్లో పిల్లలతో నేనొక్కతినీ సతమతమౌతూంటే తాను వినోద విహారాలు చేస్తున్నట్లు చెప్పటానికి సిగ్గుపడుతున్నారేమో! పోనీలే!' మనసును జోకొట్ట ప్రయత్నించింది శ్యామల.

"ఏం, అది మాత్రం న్యాయమా?" మనసు చివ్వున లేచి బుసకొట్టింది. 'సంసారభారంలో భార్యాభర్త లిరువురికీ సమాన బాధ్యతా, భాగమూ లేవా? బయట పనితో అతడెంత విసిగిపోతాడో ఇంటి పనులలో పిల్లల సమస్యలతో వచ్చీపోయే అతిథి అభ్యాగతులతో నువ్వూ అంతే విసిగి వేసారి వుంటావు కదా! అతడి ఆలన పాలనలు కనుక్కొని నీవు సేదతీర్చినట్లే, నీ కష్టసుఖాలూ వగైరా అడిగి నీ అలుపును మరిపించే బాధ్యత అతడికి లేదా? ఎక్కడెక్కడో తిరిగివచ్చి తిని నిద్రపోవడమేనా అతడి పని? ఇక ఇంటి విషయాలూ ఇల్లాలి బాగోగులూ, పిల్లల సుఖాలూ చూచేదెప్పుడు? భార్య నుండి భర్తకానీ, భర్త నుండి భార్య కానీ ఏదైనా దాచిపెడుతున్నారంటే నిస్సందేహంగా అదేదో అపసవ్యమైనదీ, వక్ర విషయమే అయ్యుండాలి." ఖరాఖండిగా అన్నది మనసు.

"ఛ, ఇందుకే అతిగా ఆలోచించరాదంటారు. ఆలోచించినకొద్దీ మతి పోతోంది!" తనను తానే నిందించుకుంటూ ఆలోచనల మార్పుకోసం ప్రయత్నించింది. కానీ అదిఆమెకు సాధ్యంకాలేదు.

ఒక్కసారిగా ఇల్లూ, పిల్లలూ, సంసారం — బాధ్యతలూ అన్నిటిపట్లా విసుగుపుట్టి, విరక్తి వంటి భావమేదో

లోపల జనించింది. తనపై తనకే కోపం వచ్చింది. అసహ్యం కలిగింది. ఆ చికాకులో వంట సరిగా కుదరలేదు. పాలగిన్నె జారి, పాలన్నీ ఒలికిపోవడమే కాకుండా, కట్టుకున్న చక్కటి చీర పాడైంది. పిల్లల ఏడుపులూ, అల్లరీ చీదర అన్పించి వాళ్ళపై శక్తికొలదీ అరిచింది. పిల్లలు బెదరిపోయి ఏడిచారు. కిక్కురుమనకుండా ఓ మూలకు జేరి కూర్చున్నారు.

సాయంత్రం వరకూ అటువంటి ఉన్మాద దశలో గడిచిపోయింది.

"అబ్బ! ఈ ఇంట్లోనుంచి కాస్త బయటపడి ప్రపంచ ముఖం చూడకపోతే పిచ్చెక్కేట్లుంది. ఆయన రాగానే ఏ పార్కుకో వెళ్లాలి" అనుకుంటూ గబగబా పిల్లల్ని తయారు చేసి తాను తయారైంది.

భర్త రావలసిన టైము దాటి గంట గడిచింది. మరో గంట కూడా తిరిగిపోయింది.

"మమ్మీ, మరి పార్కుకు వెళ్ళొద్దా మనం?" రమ నిరుత్సాహంగా రెండుమూడుసార్లడిగింది.

జాలి కలిగింది శ్యామలకు.

"పద వెళ్దాం" అంటూ పిల్లలతో ఒంటరిగానే బయలుదేరింది. సుధీర్‌ను ఎత్తుకొని, రమను నడిపించుకుంటూ వెళ్ళటం కొంత కష్టమే అన్పించినా లెఖ్ఖచెయ్యలేదు.

ఉస్సురనుకుంటూ పచ్చికపై కూలబడిన శ్యామలకు రెండు మూడు తెలిసిన ముఖాలు కన్పించాయి పార్కులో. చిరునవ్వులతో పలకరింపు లయ్యాక ఒకామె దగ్గరకొచ్చి కూర్చుంది. "ఒక్కరే వచ్చారా?" అని పలకరిస్తూ. ఆమె

ఒక ప్రాక్టీసులేని ప్లీడరు భార్య, పేరు కుసుమ. ఆమె వేపే వెకిలివేషాలూ, హాగే అతి వాగుడూ శ్యామలకు అసహ్యంగా వుంటాయి. అందుకే మాట్లాడడం ఇష్టంలేనట్టుగా ముక్తసరిగా "ఊఁ, ఒక్కతెనే కాదు. పిల్లల్ని తీసుకొచ్చాను" అన్నది.

అతివాగుడు కుసుమ వదిలిపెట్టలేదు. "అంతేలెండి. ఒక్కళ్ళంరాక చేసేదేముంది? పేకాటలు ఆడీ ఆడీ వాళ్ళు ఏ అర్థరాత్రో ఇళ్ళకు జేరుకుంటారు మనల్ని కూడా తిప్పుకునే భాగ్యంకూడానా?"

"పేకాటా?" కొత్తగా వినడం వలన ఆశ్చర్యపడింది శ్యామల! "మీవారు రోజూ పేకాడతారా?"

కుసుమ కనులు ఆశ్చర్యంతో కదులాడాయి. అదోక మాదిరిగా తల ఎగవేస్తూ అన్నది: "మావారేమిటి, మీవారేమిటి? వీళ్ళంతా ఆ శంకరం ఇంట్లో జేరుతుంటారు. ఈ దిక్కుమాలిన పేకాటకోసం. ఓ టైమూ లేదు, పాడూ లేదు. మా ఆయనకి కోర్టుకెళ్ళటం కంటే ఈపేకాటకి హాజరవ్వటమే ముఖ్యం. ఓ టైముకు చచ్చినట్టు హాజరయ్యి తీరవలసిన ఉద్యోగికాదు కదా?

ఆ మాటలందలి కొత్తవార్త కంటె, అంతంలో చేసిన ఆ వ్యాఖ్యానం— అందలి శ్లేష శ్యామలకు కోపం కలిగించాయి. కుసుమ చెప్పుకుపోతోంది: "ఆదివారాలైతే మా యింట్లో తిష్ఠ! మిగిలిన రోజులైతే— రెండ్రోజులు గోపాలం ఇంట్లో. మరో రెండ్రోజులు శంకరం యింట్లో. అయినా ఈ విషయమేమీ మీకు తెలియనే తెలియవా? అయితే

మీాఆయన చాలా తెలివైన వారన్నమాట."

కంపరం పుట్టింది శ్యామలకు. "వెళ్తాను, చీకటిపడు పడుతోంది!" అంటూ లేచింది.

"నేనూ వెళ్ళాలి." కుసుమకూడా లేచింది. "రండి ఎప్పుడైనా మాయింటికి. ఎప్పుడూ రానేరారూ."

"వస్తాలెండి."

పార్కు చుట్టుపట్ల కనుచూపుమేరలో ఎక్కడా రిక్షా లేదు.

కుసుమ యిల్లు చాలాదూరం. "అబ్బ ఎలా నడిచేది బాబూ ఇంతదూరం?" అనుకుంటోంది.

"మరి వచ్చేప్పుడెలావచ్చారు?" శ్యామలపశ్నించింది.

"మా ఇంటిప్రక్క వాళ్ళబ్బాయి ఇటుగావస్తున్నాడు అతడికి కారుంది. డ్రాప్ చేశాడు. అలాగే ఎవరైనా తెలిసిన వాళ్ళు కనపడకపోరులెండి." ధీమాగా అంది. ఆ మాట పూర్తికాకుండానే ఎవరో పరిచితుడు కన్పించనే కన్పించాడు కుసుమకు.

"నమస్కారం, ఏమిటిలా వచ్చారు ?" అన్నాడు స్కూటర్ ఆపి కాలు క్రింద ఆన్చుకుంటూ.

"ఆయన ఇంకా ఇల్లుజేరుకోలేదు. ఒక్కతినీ తోచక ఇలా పార్కుకు వచ్చాను. తీరా చూస్తే ఒరిక్షా కాదుకదా తెలిసిన నాథుడెవడూ కన్పించటంలేదు. కాస్త 'లిఫ్టు' ఇస్తా రేమిటి?" అతడికి అతి దగ్గరగా నిలబడి ఇంచుమించు తగుల్తో న్నట్లుగావుండి. మాట్లాడ్తోంది కుసుమ.

"ఓ! అంతకంటే భాగ్యమా? రండి" అన్నాడా యువకుడు

"మీ బంధువులా?" అడిగింది శ్యామల మెల్లగా.

పళ్ళు బయటపెట్టి నవ్వింది కుసుమ. "బంధుత్వం అనే పాడుపదం నాకు తెలియదు. స్నేహం! అదొక్కటే తెలుసు. ప్రాణం ఇవ్వగల స్నేహితులున్నారు నాకు. ఈయన ఉమాచంద్ అనీ... ఉత్తరాదివాళ్లు లెండి. ఈ ప్రాంతాల కొచ్చి స్థిరపడిపోయారు."

శ్యామల వింటూన్నది. మానవుడు చంద్రమండలంపై అడుగిడి విహరిస్తున్నాడన్న దానికంటే వింత వార్త లేదని లోగడ భావించిందికానీ, పరిశీలించే ఓపిక వుండాలే కానీ క్షణక్షణం విడ్డూరాలు వినవస్తూ కనవస్తూనే వుంటాయి. భూమండలంలో! ఆమె కనుపాపలు కదిలికను కట్టిపెట్టాయి తాత్కాలికంగా, కనురెప్పలూ, నాశికా తమతమ ధర్మాలదు విస్మరించాయి. ఉమాచంద్ స్కూటర్ వెనుకసీటుపై కూర్చుని, అతడి మీదిమీదికి ఒంగుతూ అతడి భుజంపై చేయివేసి కబుర్లుచెప్తూన్న కసుమను చూచి.

"టాటా!" చాదస్తురాలినై ఈ సంఘంలో ముందుకు నడవలేక పోతున్నానా? లేక వీళ్ళంతా నాగరికత ముసుగులలో అటవికులుగా మారిపోతున్నారా?" ప్రశ్నించుకొంది శ్యామల.

పరాయి పురుషులతో అతి చనువుగా ప్రవర్తించే కుసుమ నైతిక విలువలను గురించి శ్యామల అనుమానించకుండా వుండలేకపోయింది.

"ఎక్కడికి కెళ్ళారూ?" శ్యామల ఇల్లుజేరి అప్పుడే తలుపుతీస్తూండగా ఆనందరావు స్కూటరు వచ్చింది. పలకరింపుగా అడిగాడు.

'పిల్లలు మరీ గోలపెడుతూంటే పార్కుకుతీసుకెళ్లాను'

అతడేదో అపరాధం చేసినట్లుగా ముఖం పెడుతూ "త్వరగా వచ్చేద్దామనే అనుకున్నాను కానీ. పనవందే మరి" అంటూ సంజాయిషీ చెప్పుకున్నాడు.

ఇక ఈ అబద్ధాలను సహించలేకపోయింది శ్యామల.

"పనవ్వలేదా, పేకాట అవ్వలేదా?" అనడిగింది అతడి కళ్ళలోకి సూటిగా చూస్తూ.

"ఛ, ఎప్పుడైనాఆడ్తానేమోకానీ రోజూనా? ఇవ్వాళఆడనిదే? నీమైడీలాగా తయారౌతున్నా వన్నమాట!" నవ్వేశాడు కానీ, ఆ నవ్వులో సహజత్వం లోపించడం శ్యామల గమనించపోలేదు.

అప్పటికి సంభాషణ మరి సాగలేదు.

భోజనాలదగ్గర శ్యామలే సంభాషణ ప్రారంభించింది.

"పార్కులో మీ అతివాగుడు ఘటం కన్పించింది!" అన్నది.

"ఆ ప్లీడరు పెళ్ళాం కుసుమ." అన్నది వివరిస్తూ.

అతడు మాట్లాడలేదు కానీ, ఆ నొసలు చిట్లింపులో ఒకవిధమైన ఆగ్రహమూ, అసహనమూ ద్యోతకమైనాయి.

"ఎప్పుడైనా వాళ్ళింటికి రమ్మన్నది."

"......" ఆనంద్ మాట్లాడకుండా అన్నం తినేస్తు

న్నాడు. అయిష్టంగా వుందన్నమాట సంభాషణ!

శ్యామలమాత్రం మాటలు మానలేదు. "వాడెవడో ఉమాచంద్ అట! స్నేహితుడట! వాడి స్కూటర్ ఎక్కి వెళ్ళిపోయింది. వాడితో శరీరమంతా తగుల్తూ కూర్చుని. ఇదెక్కడ విడ్డూరం! నే నేమనుకుంటానో కూడా లేదు. ఆ మొగుడికి తెలుసా ఈవిడ తిరుగుళ్ళు?"

ఛర్రున తలెత్తాడు ఆనంద్. మొగం జేవురించగా, తీక్ష్ణంగా అన్నాడు. "అందులో అంతగా వ్యాఖ్యానించ టానికేముందీ? అన్నా చెల్లెలి భావం కావచ్చు కదా?"

ఆశ్చర్యాని మించినటువంటి అనుభూతి ఏదో కలిగింది శ్యామలకు. 'ఒక అవక్రమమూ, అవినీతి అయిన విష యాన్ని ఇతడెందు కిలా సమర్థిస్తూన్నట్టు?' తనను తానే ప్రశ్నించుకొంది. అతడి గుణాలుకూడా అటువంటివేనా, లేక అదేమైనా కుసుమపై అభిమానమా?

ఆలోచనలను పైకి వ్యక్తీకరించకుండా, మామూ లుగా అన్నది. "బాగుంది, అదేంమాట? నామకార్థంగా ఎవడినో అన్న అనుకొనీ, ఇంకెవతినో చెల్లెలనీ అనుకుంటే అయిపోతుందా? అటువంటి మాటలు చెపుతూ లోకం కళ్ళు కప్పేవాళ్ళ నెందర్ని చూడటంలేదు."

భార్య మాటలు వింటూనే ఆనంద్‌కు చాలా కోపం వచ్చింది. "డర్టీగా మాట్లాడకు. నా స్నేహితు లెందరితో నువ్వు చనువుగా మాట్లాడవు? అంతమాత్రాన నీ ప్రవర్తన మంచిదికాకపోయిందా? ఆవిడ మరి కాస్త చనువు వుండబట్టి ఆటైముకు ఏ రిక్షా దొరకక అట్లాగ చేసిందని ఎందుకనుకోవు?

చెడుగా ఆలోచించటమే కాని, మంచిగా ఎందుకాలోచించ వని నా ప్రశ్న?"

విసురును తనమీదకే తిప్పిన ఆ ధోరణికి, ఆ మాటల లోని తీవ్రతకూ నిర్విణ్ణురాలైంది శ్యామల. ఆ నిశ్చేష్టత నుండితేరుకొన్న తర్వాత ఆమెకు ఆగ్రహం, అవమానం ముప్పిరిగొనివచ్చి మౌనంవహించకుండాచేశాయి. "బాగుంది మీ వరస. ఎవత్తో ఎవడితోనో విశృంఖలంగా తిరుగుతోం దంటే మధ్యన మీ కెందుకూ దుగ్ధ? ఏం ఎప్పుడైనా మీరు కూడా అలా వెంటేసుకుని తిప్పుతున్నారా ఏంఖర్మ? అం తగా సమర్థించుకొంటున్నారు."

"ఆహా! తప్పేంలేదు." తొణకని స్వరంతో తగ్గని దూకుడుతో వుందతడి స్వరం. "అవన్నీ నీ కర్థంకాని విష యాలులే. అట్టే తడిమి తడిమి అడగబోకు."

ఏదో నిషాలో వున్నట్టు మాట్లాడుతున్న అతని ధోర ణికి అసహ్యం కలిగిన శ్యామల మరి తర్కం పొడిగించలేదు. కాని ఆమె మనసున వుండీ వుండనట్లు దోబూచు లాడుతున్న కొన్ని అనుమానాలు ఆధారరహితం కావని ఈరోజున రూఢి అయ్యింది.

"ఆ కుసుమపై ఎందుకు ఇతడికింత అభిమానం? ఆమె ఇంట్లో కూర్చుని వేక ఆడీ ఆడీ ఆమె పట్ల ఆకర్షితుడౌతు న్నాడా?" ఇన్నాళ్ళు సంసారం చేసిన తర్వాత ఈనాడు ప్రథ మంగా భర్తపై ఒకవిధమైన ఉద్వేగం కలిగింది. ఫలితంగా ఏదో తెలియని నీరసం ఆవరించింది. ఎన్నాళ్ళో లంఖణాలు చేసినట్లుగా నీరసం అలుముకొంది మనఃశ్శరీరాలు రెండింటినీ.

"కూడని పనులుచేసి, తినరాని పదార్థాలు తినీ ఏది మంచో ఏది చెడో తెల్సుకోలేక మారాంచేసే పసిపిల్లల్లాగా చాలామంది పురుషులు ఎందుకో అవినీతి అక్రమాలవైపూ, అసహ్యాతా అపసవ్యతల దెసా ఆకర్షింప బడతారు. ఇది వారిలోవున్న బలహీనతా లేక జబ్బా?"

సమాధానం తెలియని ఈ ప్రశ్న చాలామందీ సంసారిణులకు అనాదినుంచీ ఎదురౌతున్నదే!

# 6

ఆఫీసుకు వెళ్ళబోతూన్న ఆనందరావుకు వెనుకనుంచి శ్యామల హెచ్చరిక విన్పించింది. "బాబుకు పాలడబ్బాఅయిపోయింది. తీసుకురండి, సాయంత్రం వచ్చేటప్పుడు ఇంకా.."

"ఊఁ, ఇంకా... ఇంకా......! రోజు రోజుకూ ఈ లిస్టుకేం అంతూ పొంతూ లేదు. ఎక్కణ్ణుంచి తేను?" చిటపట లాడాడు ఆనంద్.

"ఇవి తప్పనిసరి ఖర్చులు. సంసారానికి అవసరమైనవే తెమ్మంటున్నాను కానీ, ఏమీ విలాసాలకూ వినోదాలకూ అనవసర ఖర్చులు చేయమని పీడించటంలేదుగా నేను?" ఖచ్చితంగా వుంది శ్యామల ధోరణి.

"నేనేమైనా అనవసర ఖర్చులు చేస్తున్నా నంటావా అయితే?" వెనక్కు వచ్చి తాపీగా కూర్చుని తీక్షణంగా

అడిగాడు.

"ఏమో, ఆ భగవంతుడికే తెలియాలి."

"ఆఁ ఆఁ, భగవంతు డొకడు మళ్ళీని!" అతడిస్వరంలో హేళన.

శ్యామల ఇక నిగ్రహించుకోనలేక పోయింది. "ఏం, సంసారం, భార్యా, పిల్లలపై అనురాగం తగ్గడంతో పాటు? భగవంతుడిపై నమ్మకంకూడా సన్నగిల్లిందా?

ఆనంద్ అసలే కోపంగా వున్నాడు. అవతల వేళ మించిపోతోంది. దానికితోడు శ్యామల ఎన్నడూ లేనిది మాటకుమాట విసరుతూండటంతో అతడికి వెర్రి కోపం వచ్చింది.

"ఏమైనా మతుండే మాట్లాడుతున్నావా? ఖర్చులు తగ్గించుకోవాలని నేనంటూంటే ఏమి టేమిటో వాగుతా వేమిటి?" శక్తికొలదీ అరిచాడు.

అతడి చాటు తిరుగుళ్ళూ, దొంగకారణాలూ తెలుసు కొన్న నాటినుండీ కుతకుతలాడే మనస్సుతో కుమిలిపోతూన్న శ్యామల ఇప్పుడు అగ్నిపర్వతంలా బ్రద్ధలైంది. "మతుండి మాట్లాడవలసింది నేనుకాదు. నేనేం జూదమాడి డబ్బు నాశనం చేయటంలేదు. నీతీ, గుణమూ లేని ఏ దిక్కుమాలిన కొంపలూ పట్టుకు తిరిగి దొంగ కారణాలు చెప్పడంలేదు. లక్షణంగా ఇంటిపట్టున వుంటూ, గుట్టుగా సంసారం చేసు కొనే నాకు ఎవళ్ళూ అతిగా వాగవద్దనీ అదనీ ఇదనీ చెప్ప అవసరం రాదు, రాబోదు!"

"నోర్మూయ్, మహా పతివ్రతవు బయల్దేరావు. పాపం నువ్వు తప్ప అంతా బుద్ధిలేనివాళ్ళే ప్రపంచంలో!' విసవిసా వెళ్ళిపోయాడు.

అమాయకురాలనీ, ఇంటిపట్టున పడివుండేదనీ తాను భావించే భార్య తన బలహీతలను ఎత్తిచూపించే సమాధానం చెప్పలేని ఏ పురుషుడైనా విదిలించే పద్ధతే అది!

ఆఫీసులో లంచ్ టైములో ఆనంద్ మనస్సులో ఆ ఉదయం తనకూ భార్యకూ జరిగిన వాగ్వాదం తిరిగి మొదల సాగింది.

"తానుమాత్రం ఏమన్నది పాపం! అత్యవసరమైన వస్తువులేకదా తెమ్మన్నది? నేను అలా విదిలించి మాట్లాడడం భావ్యమా?" విచక్షణాజ్ఞానం మేల్కొన్నది అతనిలో.

సరిగా శ్యామల కూడా అటువంటి మానసిక మథన తోనే సతమతమౌతోంది, ఇంటివద్ద. "బయటి ప్రపంచంలో పదుగురి మధ్యా పనిచేసుకువస్తూ పలువిధాల అలసిపోయే పురుషుడతడు! ఏదైనా పరాకులో కొంతెదురుసుగా మాట్లాడినా సర్దుకుపోక అతడిని మించిన ఆగ్రహంతో మాట్లాడాను నేను. ఇది సమంజసమా? చెత్తకుండీకైనా విలువ వుంటుందేమో కానీ, కుసుమకు సభ్య ప్రపంచంలో గడ్డిపరక మాత్రపు విలువ కూడా లేదని ఆమె అతివాగుడు వల్లా, పరాయి వాడితో షికార్లుకొట్టడంలోనే తెలుస్తోంది! మరి అటువంటి హీనగతిదాని మాటల నాధారం చేసుకొని తాను భర్తను తూలనాడడం సమంజసమా? వక్రమార్గాన బ్రతికే వాళ్ళు సక్రమంగా జీవించేవాళ్ళను చూడలేక ఏవో కలతలు సృష్టి

చాలనో లేదా తమ మురికి కూపంలోకే లాగాలనో ప్రయత్నం మామూలే. మరి నా తెలివి, బుద్ధీ ఏమైనట్లు?" పశ్చాత్తాపంతో కుమిలి పోయింది శ్యామల, భర్త ఇల్లు చేరే వరకు.

ఉదయపు తీవ్రతా, ఆగ్రహమూ ఎవరి లోనూ మిగలలేదు.

ఆమె ఏమీ జరగనట్లే నవ్వుముఖంతో కాఫీ అందించిందతనికి.

ప్రశాంత వదనంతో అతడు మాట్లాడాడు. "ఏమిటి ముఖం అలాగుంది. మధ్యాహ్నం భోజనం చేయలేదా?"

"చేశాను. మీరు?"

"చేశాలే. తొందరగా తయారవ్వు, బజారు వెళ్దాం. ఏదో కావాలన్నావుగా ప్రొద్దున్న?"

"పిల్లలతో ఇప్పుడు నేను తెమిలి బయటపడగలనా! మీరు తీసుకురండి, వంట కూడా అవలేదు."

"పిల్లల్ని నేను తయారుచేస్తాలే. నువ్వుపోయి బట్టలు మార్చుకో. హోటల్లో తినేసి వద్దాం. నీకూ కాస్త మార్పుగా వుంటుంది. మనం హోటల్ కెళ్ళి చాలా రోజులై పోలేదూ?"

నవ్యమైన జీవనక్రమంతో సంతృప్తిపడే స్త్రీ భర్త నుండి అంతకంటే ఆశించే దేముంటుంది? ఆనంద్ ఆదర వాక్యాలకు మురిసిపోయింది శ్యామల. "ఆయన మంచివారు. నేనే అపార్థం చేసుకున్నాను!" అనుకుంది మరోసారి.

"ఈనాడెంత ప్రశాంతంగా వున్నాయి. ఇల్లూ, మనసూకూడ! పురుషుడు నిర్లక్ష్యం చేస్తే ఇంట పడుండే ఆడవాళ్ళు మతులుపోగొట్టుకోక ఏంచేస్తారు?" అనుకున్నాడు ఆనంద్ ఏదోజ్ఞానోదయమైనట్టుగా.

# 7

"సర్కస్ చూద్దామా, సినిమా చూద్దామా?" భోజనాలు ముగించుతూండగా అడిగాడు ఆనంద్.

"సినిమా! సినిమా!" ఊహ తెలిసీ తెలియని రమ చప్పట్లు కొడుతూ అన్నది.

"సర్కస్ అయితే ఆ ఏనుగులవీ చూసి పిల్లలు బాగా 'ఎంజాయ్' చేస్తారు" అన్నది శ్యామల.

ఆనంద్ అంగీకరించాడు.

"మరి డబ్బు... చాలా అయిపోతుందేమో?" సంశయిస్తూ అన్నది శ్యామల. నిజానికి అటువంటి ఖర్చులు వారి స్థాయి కొొక లెక్కలోనివికావు. కాని ఈమధ్య అతడు ప్రదర్శించిన విసుగుదలను ఇంకా మరువలేదు శ్యామల.

"పోనిద్దూ. ఓ ఇరవయ్యేగా? సర్కస్ మాటిమాటికీ దొరుకుతుందా? పిల్లల సరదా కూడా తీరుతుంది."

భార్యను ఆదరించే భర్త, భర్తను సానుభూతితో— సహృదయంతో అర్థంచేసుకోగల భార్య వున్న సంసారం స్వర్గధామం కావలసిందే. కాని ఎటువంటిస్వర్గాన్నైనా విచ్ఛి

న్నమూ వికలమూ చేసే దుష్టశక్తులున్నాయి. వక్రప్రవర్తనగల పురుషులూ, చెడ్డబుద్ధిగల స్త్రీ ఈ భువిలో మహామ్మారి కంటే భయంకరులు!

సర్కస్ చూసి బయటకు వస్తూంటే ద్వారంలో ఆ జనంలో "హల్లో ఆనంద్!" అంటూ పరిచితమైన కంఠం విన్పించింది.

సోమేశ్వరరావూ, కుసుమ భర్త వెంకట్రావూ!

నమస్కార ప్రతినమస్కారాలు అయ్యాయి.

"ఎలా వుంది సర్కస్?" శ్యామలను పలుకరించారు. చిరునవ్వుతో జవాబిచ్చిందే కాని, అంతవరకూ అతిఆహ్లాదకరంగా వున్న శ్యామల మనస్సు ఆ ఇరువురి దర్శనంతో ముకుళించుపోయింది. మరచిపోయిన బాధ తిరిగి కెలుకుతూన్నట్లయింది.

"ఏమిటి స్వామీ బొత్తిగా నల్లపూసై పోయారు? నాల్గురోజులుగా మీరు రాక మన సమావేశాలు కళకట్టడం లేదనుకోండి. కుసుమకూడా అడుగుతోంది, ఆనంద్‌గారు రావటం లేదేమని," గడగడా వాగేస్తున్నాడు వెంకట్రావు.

"బాగానే వుంది. పెళ్ళానికి తీసిపోని దేభ్యం!" అనుకొంది అసహ్యంగా శ్యామల.

ఆనందరావు పరిస్థితి ఇరకాటంలో పడింది. అటు వెంకట్రావు నోరుమూసుకోడు. ఇటు శ్యామల అన్నీ వినేస్తోందనే భయం. తానామెకు తెలియకుండా వుంచిన విషయాలన్నీ ఈనాడు వెల్లడై పోతున్నాయి.

"నడవండి. దగ్గరేగా మా ఇల్లు? పదండి" వెంక

ట్రావు ఆహ్వానించాడు

"ప్రొద్దుపోయింది మరెప్పుడైనా వస్తాంలే." తప్పించుకోబోయాడు ఆనంద్.

వదలలేదతడు. "ఎప్పుడయినా రావచ్చు. ఇవాళ కూడా రావచ్చు. కూడదని ఏమీ లేదుగా? నడు నడు. ఏమైనా తీసుకువెళ్దురుగాని!"

"మా భోజనాలైపోయాయి హోటల్లో ఇంత పొద్దుపోయి ఎందుకులెద్దూ." ఎందువల్లనో అతడింటికి వెళ్ళడానికి ఆనంద్ సుముఖంగాలేదు ఎంతమాత్రమూ.

సోమేశ్వరం కల్పించుకున్నాడు. "నడు, నేనూ అక్కడికే వెళ్తున్నాను. ఓ పదినిమిషాలు కూర్చుని వెళ్దురుగాని"

"పోనీ మీరే చెప్పండి వదినగారూ!" వెంకట్రావు శ్యామలతో అన్నాడు. "నేనింతగా పిలుస్తుంటే వెళ్ళిపోవడం మీకేమైనా బావుందా? అతడికేముంది— ఇంచుమించు రోజూ వస్తూనేవుంటాడు. మీరు ఎప్పుడూ మీరై మీరు రారుకదా! ఇవ్వాళ ఇంతదూరం వచ్చి కూడా రాకుండా వెళ్ళిపోతారా?"

లౌక్యాలూ, నామకార్థపు మర్యాదలూ తెలియని శ్యామల మొహమాటంగా చూచింది. "పిల్లలు పేచీలు మొదలుపెడ్తారిక, అందుకూ. కాస్సేపు కూర్చుని మాట్లాడుకొనే టైముకాదుకదా ఇదీ?" నిజానికి కుసుమ స్వభావం తెలిసిన శ్యామలకు ఆమె ఇంటికి వెళ్ళాలని లేదు.

"పోనీ పద, ఓ పదినిమిషాలు కూర్చుంటాం అంతే!" అంటూ ఇటు భార్యతోనూ, అటు వెంకట్రావుతోనూ అని

బయల్దేరదీశాడు ఆనంద్. మరీ మాట త్రోసేసి వెళ్ళిపోతే అటు వెంకట్రావుతో స్నేహం పోతుంది. అదీ కాక వెంట సోమేశ్వరరావు కూడా వున్నాడు. అసలే అతిగా విమర్శించే స్వభావం అతడిది. 'భార్యను నీస్నేహితుల ఇళ్ళకు తీసుకెళ్ళటానికి భయపడుతున్నావ్' అని మరోనాడెప్పుడైనా వాగి అవమానించగలడు నలుగురిలోనూ. ఇటు శ్యామలకు మొదలే కుసుమపై సద్భావం లేదు. ఇక ఆ ఇంటి వాతావరణాన్ని చూచి మరింత అసహ్యించుకోగలదు!

ఆనందరావు అంచనా తప్పలేదు. అనుకున్నంతా అయ్యింది.

కుసుమా మరో నలుగురు పురుషులూ పేక ఆడుతున్నారు. ప్రక్కనే ఒక ఖాళీ వైన్ బాటిల్ వుంది. మరొకటి సగం ఖాళీగా వుంది. కుసుమతో పాటు అందరి చేతులలోనూ గ్లాసులున్నాయి. ఆ పురుషులలో ముగ్గురు శ్యామలకు తెల్సినవారే. ఉమాచంద్, గోపాలం, శంకరం, నాల్గవ వ్యక్తి ఎవరో? ఎవరో బాగా డబ్బున్న వాడిలాగా, నిత్యం నీతీ నియమం లేకుండా త్రాగి తందనాలాడే వాడిలాగా అన్పించాడు చూడగానే.

"చూడు, రాక రాక మిసెస్ ఆనంద్ వచ్చారు. ఏమైనా ఇవ్వు కుసుమా." అని చెప్తూనే తానూ ఒక గ్లాసు చేతబట్టాడు వెంకట్రావు. సోమేశ్వరం కూడా తీసుకున్నాడు కానీ, ఆనంద్ మృదువుగా తిరస్కరించాడు.

"ఛీ, ఏమిటీ వాతావరణం? నడవండి పోదాం" మెల్లగా గొణిగింది శ్యామల.

"తీరా వచ్చేక ఓ పావుగంటైనా కూర్చోక పోతే ఎలా!" నసిగాడు ఆనంద్.

ఏదో మురికి కాల్వలో మెడవరకూ దిగబడినంత కంప రంగా వున్నది ఈ వాతావరణం శ్యామలకు.

"తీసుకోండీ, ఏమిటివ్వాళ మడిగట్టుకున్నారు?" వైన్ గ్లాసు కుసుమ స్వయంగా అందించితే మరి త్రోసివేసే శక్తి లేకపోయింది ఆనందరావుకు.

అప్పుడప్పుడు ఏదో స్నేహితులతోనూ, పార్టీలలోనూ నామకార్థంగా సరదాగా భర్త త్రాగుతూంటాడని శ్యామ లకు తెలుసు. కాని ఇటువంటి హీనంగా కన్పట్టే స్నేహితు లున్నారని గానీ, నీచపు ఆకర్షణలున్న తావుకు అతడు జేరు తూంటాడనిగానీ ఇంతవరకూ శ్యామలకు తెలియదు.

సినిమాలు, స్నేహితులు, పిక్నిక్‌లు— ఎక్కడెక్కడి విషయాలనో చుట్టబెట్టి తెగవాగుతోంది కుసుమ. ఆమె ఎక్కువ మాట్లాడేది మగవాళ్ళతోనే. సాటి స్త్రీ అయిన శ్యామలను అస్సలు లెక్కచేస్తూన్నట్టేలేదు.

"వీరు మీ శ్రీమతా? ఇన్నాళ్ళూ మన పరిచయమే గాని, వారి నెప్పుడూ ఎక్కడా చూడలేదే! సంతోషం. ఇదే మొదటిసారి చూచాను." ఆ కొత్త మనిషి అన్నాడు పేకాట కట్టిపెట్టి మంచంమీద వాలుతూ.

చిరునవ్వుతో సమాధాన మిచ్చాడు ఆనంద్. "ఈ పిల్లలిద్దరూ పసివాళ్ళవ్వడంతో అంతగా ఇల్లుకదిలే అవకాశం వుండదు" భార్యకు పరిచయం చేశాడు. "ఈయన మంజులా హోటల్ ప్రొప్రైటర్ భుజంగరావుగారు!" అని.

ఇంటికి వచ్చేవరకూ తనను తానెలా నిగ్రహించుకో గలిగిందో తనకే తెలియదు శ్యామలకు.

ఇల్లు తాళంతీసి లోపల అడుగిడుతూనే తీక్షణంగా చూస్తూ అడిగింది భర్తను. "ఇదన్నమాట మీ కుసుమ అసలు భండారం. అదసలు సంసారి కొంపేనా?"

అనుకోని ఈవాగ్ధాటికి మొదట నిరుత్తరుడై చూచాడు ఆనంధ్, అంతలో తేరుకొని విసురుగా జవాబిచ్చాడు. "నీకు 'సోషల్'గా 'మూవ్' కావడం ఇహ ఈ జన్మకి తెలియదు. అందరూ నీకు డిటోగా మందకొడిగా ప్రపంచం మొహమే తెలియకుండా వుండాలా?"

మనసు మండిపోతోన్న శ్యామల ఆగ్రహం మరింత రెచ్చిపోయింది. "ఛీ, 'నాగరికత' అనే పదాన్ని ఉచ్చరించే అధికారమూ, అర్హత కూడా వున్నాయా ఆ నీచులందరికీ? సోషల్‌గా వుండటమంటే ఏమిటి? భర్త లేని సమయంలో పరాయి మగాళ్ళను పడగ్గదిలో పెట్టుకు, తాగి తందనా లాడ్డమా? పరాయివాడి మీద మీద పడి మాట్లాడ్డమా? భోగందానిలాగా విస్కీలూ, బ్రాందీలూ అందించడమా? ఇదంతా కళ్ళారా చూచి ఆ మొగుడికి చీమకుట్టినట్లయినా లేదే! ఔను మరి? ప్రాక్టీస్‌లేని చవట— ఇలా అడ్డదార్లు పట్టకపోతే అంత హోదాగా ఎలా బ్రతుకుతాడు?"

"ఏమిటాధోరణి? నోరుమూస్తావా?"

"ఎందుకు ముయ్యాలి? ఇందులో ఏది అబద్ధం, అసంగతం?

"అసూయ ముందుపుట్టి ఆడదితర్వాత పుట్టిందంటారు.

ఏ ఆడదాన్నీ ఏ ఆడదీ మెచ్చుకోదు. మెచ్చుకోబోదు. అది ఈ దేశం చరిత్ర!" చేతిలో స్కూటర్ తాళాలు టేబుల్ మీదికి విసుగ్గా విసిరేసి పక్క మీద వాల్తూ అన్నాడు.

"ఆడది కాదద్దీ, జారిణి! జారిణిని సంసారిణి ఏనాడూ మెచ్చుకోదు. అయినా ఎవతెలాపోతే నాకేం? అదే గంగలో దిగితే నాకేం? ఈ పనికిమాలిన ముఠాతో మీ కెందుకు స్నేహమని అడుగుతున్నాను? మీరా కొంపకి ఎందుకు వెళ్తున్నారని అడుగుతున్నాను. భర్త పెడదార్లుపట్టుతూంటే బాధపడడం, సరిదిద్ద బోవడం ఈ దేశం చరిత్ర! ఇది తెల్సుకోండి."

"ఇదిగో శ్యామలా! రెచ్చగొట్టకు నన్ను చెప్తున్నాను." పట్టరాని ఆగ్రహంతో వున్నట్లు అతని కన్నులే చెప్తున్నాయి. నువ్వో మంచిదానవూ, తక్కిన అందరూ చెడ్డవాళ్ళనుకుంటే అది నీ ఖర్మ! నేనేం చెడిపోవడంలేదు. నువ్వు బాధపడక్కర్లేదు. నన్ను సరిదిద్దడానికి శ్రమపడ కక్కరలేదు. నీ జ్ఞానం కొంచెం ఎక్కువచేసుకో చాలు!"

"నా జ్ఞానం ఎక్కువైంది. ఇవ్వాళ చాలా ఎక్కువైంది. నాగరికత ఏదో అటవికత ఏదో తెలియని అజ్ఞానంలో పడి కొట్టుకునే మూర్ఖులను చూచి జ్ఞానంకాదు పెరిగేది— అశాంతి!"

"మంచిది. అవే మీ పతివ్రతల ఆభరణం!" హేళనగా అనేసి మరి మాట్లాడకుండా అటుతిరిగి పడుకున్నాడు.

ఆగ్రహం; అసహ్యం, అవమానం, అసహాయత— అన్నీ పెనవైచుకొని అంత రాంతరాలలో చాలా దుఃఖం

చింది శ్యామల. ఈ పురుషులూ, ప్రపంచం—అన్నీ మోసం, దగా, నాటకం; బూటకం అన్పించాయి. 'ఛీ. ఇటువంటి కల్లిబొల్లి జీవితం ఎందుకు? బ్రతకకపోతేనేం?' అనే విరక్తి కలిగింది. కాని ఆ విరక్తి అట్టేకాలం నిలవకపోవడమే ఈ ప్రపంచాన్ని నడిపించే మాయ.

భర్త ఉన్నతుడూ, ఉత్తముడూగా భావించే స్త్రీకి, తన నమ్మకము భ్రమ అనీ, అతడు చవుకబారు అభిరుచులూ ప్రవర్తనా గల అతి మామూలు వ్యక్తి అనీ తెలిసిపోవడం మహా దారుణం; శాపసదృశ్యమైన సంగతి.

"ఆ కుసుమ నాకంటె అందగత్తా?" ఒక్కోప్పుడు కొత్తతరహాలో సాగేవి శ్యామల ఆలోచనలు. 'ఛీ. క్షయ రోగిలా వాలకం, అసహ్యకరమైన రూపురేఖలు' బిగ్గరగా అసహ్యకరంగా వాగుడు—పోనీ చదువా అంటే అదీ లేదు. మరెందుకీ మగవాళ్ళంతా వెర్రికుక్కల్లా తిరుగుతూన్నట్టు దానిచుట్టూ? బహుశః ఇంట రాత్రింబవళ్ళూ హద్దులూ, అందమూ, అణకువా, ఆహ్లాదతా చూచి చూచి మొహం మొత్తి అవి లేనిచోట విరగబాటూ విశృంఖలత విహారం చేసే తావుకు జేరతారేమో; అక్కడున్నది కురూపి అయినా సరే.'

## 8

ఆనాటి ఘర్షణ తర్వాత శ్యామలా ఆనంద్‌ల నడుమ.

మాటలు పూర్తిగా తగ్గిపోయాయి. భర్తఎడల అనురాగం తగ్గకపోయినా ఒకవిధమైన విరక్తి వంటిది పేరుకొంటున్నది శ్యామల మనస్సులో. భర్త ఎలా తిరిగినా మౌనం వహించి అడుగులకు మడుగులొత్తగల కాలం కాదిది. 'నేనేం తనకు తక్కువ చేశానని ఇలా పెడత్రోవలు త్రొక్కుతున్నారు? లక్షణమైన భార్య వుండగా నీచ స్త్రీలపట్ల ఆకర్షణకలిగే బలహీనత ఏమిటితడికి?' అని బాధపడకుండా వుండదు ఎంత ఉత్తమ స్త్రీ అయినా.

ఆనాడు భార్యతో మొండిగా వాదించాడే కాని ఆనంద్ తన అంతరాత్మను వచించలేకపోయాడు, ఈ అసత్య వాదాలతో. భార్యవాదం ఎంత నిజమైనా, కారణరహితం కాకపోయినా భర్తకు తనను నిలదీసి అడిగిందన్న కోపం రావడం సహజమే! కాని అది సమంజసమేనా? అంతరాంత రాలలో మథనపడుతున్నా, ఆనంద్ బాహ్య ప్రవర్తనలో మాత్రం మార్పు రాలేదు. టైముకు ఇంటికి వెళ్ళామని అతడు ఎంతగా ప్రయత్నించినప్పటికీ, గోపాలం ప్రభృతులు వదలిపెట్టరు. ఆ కవ్వింపులకూ, సవాళ్ళకూ వ్యతిరేకంగా నడచి, 'అసమర్థపు భర్త' అని స్నేహితులు చాటుమాటుగా విమర్శించే అవకాశం ఇవ్వలేదు. పీడ జ్వరంనుండి బయట పడటం కంటె కష్టం దుష్టస్నేహాలనుంచి బయటపడటం.

'ఛ. నవ్వుతూ, త్రుళ్ళుతూ సరదాగా ఉన్నంత మాత్రాన అపార్థం చేసుకోవటమేనా? కుసుమ అంతగా తీసిపారేయాల్సిన చెడునడత కలది కాదు!'

అలా ఆలోచించి మనసును మభ్యపెట్ట జూచాడేకా

అది సరికాదని తనకూ తెలుసు.

'పోనీ. అదెవరైతే నాకేం? ఏమయితే నాకేం? ఏదో పరిచయం, కాలక్షేపం! అంతే! ఈ మాత్రానికే నేనేమీ చెడిపోలేదే! కాస్త నలుగురిలో కలసివుండకపోతే ఎలాగ? ఆ నలుగురూ మనకున్న సుగుణాలే కలిగివుండాలనుకుంటే ఎలా కుదురుతుంది? ఛ. నలుగురిలో కలిసిపోవటం రాదు శ్యామలకు.'

అదే విషయాన్ని పైకే అనేశాడు ఒకనాడు వాగ్వాదంలో. ఓ సెలవుదినం అందరూ భార్యలతో సహా పిక్నిక్ వెళ్ళే ఏర్పాటు జరిగింది. అది ఏర్పాటు చేసినవాడు ఆ హోటల్ మానేజర్ భుజంగం. ఆ విషయం వింటూనే తిరస్కరించింది శ్యామల ఛీత్కారం చేస్తూ.

"ఛీ ఛీ. ఆ త్రాగుబోతు ముఠా సంగతులు నాకు చెప్పవద్దు!" అన్నది మండిపడుతూ.

ఆనందరావు కోపం తెచ్చుకోలేదు. సర్ది చెప్పటానికి ప్రయత్నించాడు. "చూడు శ్యామలా. వాళ్ళెవళ్ళైతేనీకేం? ఓ ఏడెనిమిది గంటలు సర్దాగా గడిపేయటం. అంతే. ఈ ఇంటిపనుల చీకాకు తగ్గి నీకూ కాస్త మార్పుగా వుంటుంది. నలుగురిలో తిరగటం, కలిసి పోవటం నేర్చుకోవాలి." వింటూనే ఛర్రుమన్నది శ్యామల. "ఇంటి పనులు శ్రమ అయితే కావచ్చుకాని, చీకాకుకాదు బుద్ధీ, గుణమూ వున్న ఏ ఆడదానికైనా. నాకు నా యిల్లు స్వర్గం. ఈ స్వర్గాన్ని వదులుకుని అక్కడ ఎవతెవతో మీ మీద మీద పడి మాట్లాడటం, మీరుకూడా గ్లాసులు ఖాళీచేయడం చూసి

నేను భరించలేను. అది నాకు శ్రమను మరిపించే మార్పు కాదు సరికదా—ఓ రెండు మూడు నెలలకు సరిపడిన మనస్తాపం!"

"ఏమిటంత ఇదిగా మాట్లాడ్లావ్? నలుగురిలో వున్నపుడు కంపెనీకోసం కాస్త తీసుకోక తప్పుతుందా? ఏదో మరీ తప్పతాగి తందనాలాడే వాడినన్నట్టు అంటావేమిటి? అప్పుడప్పుడు కొద్ది కొద్దిగా తీసుకుంటే ఆరోగ్యం కూడాను. ఈ రోజుల్లో వస్తూన్న మందులన్నింటిలో ఆల్కహాల్ కలుస్తోంది తెలుసా?" తేలిగ్గా నవ్వేశాడు. ఎలాగైనా భార్య గాంభీర్యాన్ని చెదరగొట్టాలనే ప్రయత్నంతో.

అయితే, శ్యామల గాంభీర్యంగాని, అభిప్రాయంగానీ ఇసుమంతైనా చెదరలేదు, మారలేదు. అతడిని సూటిగా చూస్తూ అన్నది. "ఓ! అయితే ఆ ఆరోగ్యం నాకూకూడా వుంటే మంచిదికదూ? ఓ వైన్ సెట్, విస్కీసెట్, బీర్ గ్లాసెస్ అన్నీ కొని తీసుకురండి సాయంకాలం. టీ సెట్ దాచేసి, ఇక ఇంటికి వచ్చేవారికి హాట్ డ్రింక్సే ఇద్దాం. మనమూ అవే తీసుకుందాం. ఇప్పట్నుంచీ అలవాటుచేస్తే పిల్లలు మంచినీళ్ళు మానేసి అవే పుచ్చుకుంటారు."

ఆమె ఎంతో మామూలుగా మాట్లాడి నప్పటికీ ఆనంద్ కు కోపం, నవ్వూ సమపాళ్ళల్లో వచ్చాయి. అప్పటికీ కోపాన్ని ప్రయత్నపూర్వకంగా దాచిపెట్టాడు. నవ్వుతూనే అన్నాడు. "అద్భుతమైన మాటలు! వండర్ ఫుల్ అయిడియా! నా నెలజీతం ఏ రెండువేలో అయితే తప్పకుండా ఈ క్షణంలోనే నీ మాటను అమలులో పెట్టేద్దును."

"జీతంతో పనిలేదు. వెంకట్రావుకు పైసా ఆదాయం లేకపోతేనేం—ఎంత దర్జాగా బ్రతుకుతున్నాడు! కుసుమ ఎలా వెలిగిపోతోంది? ప్రయత్నిస్తే ఆమాత్రం చిట్కాలు నేనూ నేర్చుకోలేకపోను. ఇక అప్పుడు వాళ్ళంతా మన ఇంటికే జేరతారు. మీరు ఏ కుసుమ ఇంటికీ, మరే కుమారి ఇంటికీ వెళ్ళనక్కర్లేదు. ఆ బృంద మంతా ఇక్కడే పడి వుంటుంది." ఆ మాటలలో వేడికీ, వాడికీ ఆనంద్ ముఖం నడివేసవి మిట్టమధ్యాహ్నపు ఎండలో చెప్పులులేని కాళ్ళతో నడిచినంతగా మాడిపోయింది. ఎటూ మాట్లాడ లేని అశక్తతతో అవమానంతో మౌనంగా, అక్కడినుంచి లేచి వెళ్ళి పోయాడు.

మనశ్శాంతి కోసం కొంత సేపు ఒంటరిగా వుండా లనిపించిం దతడికి. అందుకే వెంటనే ఏదో పని కల్పించుకొని బయటకు వెళ్ళిపోయాడు.

శంకరం, గోపాలం వగైరా స్నేహితులు భార్య మాటకు జవదాటవని వేళాకోళం చేస్తే ఈ కొత్త స్నేహితు డైన భుజంగమేమో భార్యను 'సోషల్‌గా తిప్పవు— పూర్వ కాలపువాడిలా పరదా స్త్రీని చేసేశావు భార్యను' అని ఆటలు పట్టిస్తున్నాడు. ఇటు భార్య వాదన విన్నప్పుడు ఆమె మాటలు సమంజసం గానే అనిపిస్తాయి పైపైకి భర్త హోదాతో తాను కొట్టిపారేసినా! అటు స్నేహితుల 'కామెంట్'కూ విలువ ఇవ్వకుండా వుండలేడు. ఆలోచించి ఆలోచించి అతడి బుర్ర వేడెక్కింది. పక్కా హిందూ పతివ్రత అయిన శ్యామలను ఈ భూతలంలో ఎవరివాదనలూ

మార్పులేవనేది సూర్య చంద్రులు. ఉదయించడం ఎంత తథ్యమో అంతా యదార్థం. ఆ ఆలోచన మనసున మెదల గానే అతడి అంతరంగం ఆనందాతిరేకంతో నాట్యమాడింది. సాంఘిక సూత్రాలూ, కట్టుబాట్లూ ఎలాగున్నప్పటికీ గుణ వంతుడైన భర్త దొరకడం స్త్రీ ఎంత అదృష్టకరమని భావి స్తుందో, అలాగే సుగుణరాశి అయిన భార్య లభించడం పురు షుడు కూడా అపూర్వమైన వరంగా భావించవలసిందే కాని ...కానీ ఎందుకు తాను పూర్తిగా ఆనందించలేక పోతు న్నాడు? ఎక్కడ ఏమి లోపం వున్నది? శ్యామల ఆరో పించినట్లుగా నిజంగా నేనుఏమైనా ఆకర్షణలకు లోబడి పక్క దార్లు పట్టబోతున్నానా? ఔనూ, కామా అని ఎటూకూడా సమాధానం చెప్పుకోలేకపోయాడు.

"ఏమిటి స్వామీ ఏకాంతంగా కలలు కంటున్నారు ఏ అలివేణికోసం ?"

ఆ విసురు వినవచ్చినదెస చకితుడై చూచాడు.

"ఏమిటా దీర్ఘాలోచన, దేనినిగురించీ?" వెంకట్రావూ శంకరమూ దగ్గరకొచ్చి కూర్చున్నారు.

"నడు నడు. ఏమిటి ఒక్కడవూ కూర్చున్నావ్? ఎల్లుండి పిక్నిక్ ఏర్పాట్లు చూచుకోవద్దూ?"

"ఏర్పాటు నే చూసేదేమిటి ? మీరంతా వున్నా రుగా" అన్యమనస్కంగా అన్నాడు ఆనంద్.

"అయితేమాత్రం ? అందరం నడుంకట్టాలి పద పద. పిల్లాపాపల్తో వెళుతున్నామంటే చాలా చూచుకోవాలి... అయినా వెధవది ఎందుకో లేనిపోని గొడవ పెట్టాడు ఈ

భుజంగం. ఆడమళయాళాన్ని తీసుకుని పిక్నిక్‌కు వెళ్ళకుంటే నేం?" విసుక్కున్నాడు శంకరం.

"ఇప్పుడు ఎక్కడకీ మనం వెళ్ళేది? హోటల్‌కా!" ప్రశ్నించాడు ఆనంద్.

"ఆఁ, ఆ భుజంగాన్నే పట్టుకొని కాస్త తైరు కొట్టా మంటే అన్నీ ఆ హోటల్ నుంచే తక్కువో లేక 'ఫ్రీ' గానో 'అరేంజ్' చేస్తాడు" అన్నాడు వెంకట్రావు.

"చాలామంది టాక్సీలవాళ్ళు కూడా తెలిసుంటారు అతడికి, గనుక రాకపోకలకికూడా అతడే ఏర్పాట్లుచేస్తాడు."

హోటల్‌లో లేడు భుజంగం.

"మహానుభావుడు! ఏ టైములోనూ హోటల్లో దొరకడు" గొణిగాడు శంకరం.

"తెలివైనవాడు! హోటల్లో ఎందుకూ, హోటల్ని వృద్ధిచేసుకోవటంలో మునిగి వుంటాడు." వెంకట్రావు ఉవాచ.

మౌనంగా వింటున్నాడు ఆనందరావు.

భుజంగం ఇంటికి వెళ్లారు. అక్కడికి వెళ్ళడం ఆనందరావుకు ఇదే ప్రథమం కావడం వలన ఆ గేట్లనూ, అందమైన పూలమొక్కలతో వున్న కాంపౌండునూ, కాంపౌండు మధ్యన ఫౌంటెనునూ, అందంగా కన్పట్టుతూన్న ఆ రెండ తస్తుల భవనాన్నీ ఓ పక్కగా వున్న తళతళలాడే కారు మరీ మరీ చూడసాగాడు.

"ఎంత అదృష్టవంతుడు! ఇంతంత అందమైన భవనాలలో నివశించడానికి ఏళ్ళెంత పుణ్యంచేస్తారో!"

ఆనంద్ లోలోపల అనుకోబోయిన మాటల్ని పైకే అనేశాడు. శంకరం గుంభనగా, ఏదో అర్థం స్ఫురింపజేస్తూ నవ్వాడు. అందలి భావనను ఆనంద్ అర్థం చేసుకోలేక పోయాడు. వెంకట్రావు నిర్వికారంగా ఎటో చూస్తూండి పోయాడు.

ఓ అయిదు నిమిషాలు బయట వరండాలో వున్న గార్డెన్ చెయిర్స్‌లో కూర్చున్నాక ఓ నౌకరు దర్శనం అయ్యింది.

"అయ్యగారున్నారా?" వెంకట్రావు అడిగాడు.

శంకరాన్ని, వెంట్రావును ఎరిగున్న వాడే నౌకరు. ముసిముసి నవ్వులు నవ్వుతూ అన్నాడు: "లేరండి, ఈ టయములో ఇంటికా డెందుకుంటారు?"

"ఔనులే." అనుకుంటూ లేచాడు శంకరం.

అర్థంకాలేదు ఆనందరావుకు. 'లోపలినుంచి ఏదో మగ కంఠం విన్పిస్తోంది. బయట ఆవరణలో కారుంది, ఇంట్లోనే వుంటాడు. ఈ నౌఖరుకు తెలియదేమో!" అన్నాడు ఆనందరావు.

'కాదులే పదపద' అంటూ వెంకట్రావ్వూ, శంకరం దారితీయగా ఆనంద్ అనుసరించాడు విధిగా.

"మహానుభావా, ఆ కారు భుజంగానిది కాదు. ఈ వూళ్లో ఒక పెద్ద ధనవంతుడిది!" అన్నాడు శంకరం గేటు దాటాక వెటకారంగా నవ్వుతూ.

అర్థంకానట్టు చూచాడు ఆనందరావు.

"నీ కర్థంకాదులే!" అనేశాడు మళ్ళీ.

"నేను వెళ్తానోయ్, పనుంది" అంటూ మరో మాట కైనా ఎదురు చూడకుండా మరో బాటపట్టుకొని వెళ్ళిపోయాడు వెంకట్రావు గబగబా.

విస్మయంగా చూచాడు ఆనంద్. మరో హేళనా పూర్వకపు నవ్వునవ్వాడు శంకరం, అతడు నిష్క్రమిస్తూన్న దెసగానే చూస్తూ. "చూశావా ఎలా పారిపోతున్నాడో? ఈ విషయం నేను మాటలాడుతుంటే అది తనకూ్కుడా కొట్టొస్తుంది కదూ? అందుకనీ." పకపకా నవ్వేశాడు.

"అబ్బబ్బ. నాకేం అర్థంకావటంలేదు." విసుక్కున్నాడు ఆనందరావు.

"నీకు నేను సవిస్తరంగా చెప్పలేనుకానీ, ఆ సాక్ష్యాలతో ఇప్పుడే చూపిస్తాను చూద్దువుగాని. ఓ పది నిమిషాలాగు."

ఇద్దరూ సిగరెట్లు వెలిగించి నాలుగురోడ్ల జంక్షన్‌లో నుంచున్నారు. ఏదో కబుర్లు చెప్పుకుంటూన్నట్టుగా. అదంతా ధనవంతులున్న వీథి కావడంవల్ల దూర దూరంగా వున్నాయి ఇళ్ళు, పెద్ద పెద్ద ప్రాంగణాలతో. టైము ఏడు గంటలు పైగానే అయ్యింది. ఊరికి ఓ చివర కావడం వలన అంతగా జనసమ్మర్ధం లేదు. అడపా తడపా ఓ కారో, రిక్షావో వెళ్తోంది అంతే. ఇళ్ళల్లో లైట్లు వెలుగుతున్నాయి.

పావుగంట గడిచింది. "అబ్బ ఏమిటోయ్ ఇదీ?" విసుగ్గా అన్నాడు ఆనంద్.

"తాళు మరీ. పరిశోధన చేసేవాళ్ళకి ఓర్పు అవ

సరం." శంకరం జవాబుచెప్పాడు. మరో సిగరెట్టు వెలిగించి. మాటి మాటికీ అతడికళ్ళు భుజంగం ఇంటివైపు తిరుగు తున్నాయి. భుజంగం మేడ వరండా—వీధివైపుది—అక్క డకు స్పష్టంగా కన్పిస్తోంది. ఇల్లంతా లైట్లు వెలుగు తున్నాయి.

మరో పదినిమిషాలు గడిచాయి.

వారి నిరీక్షణ వృథాపోలేదు. "అటు చూడు" అన్నాడు శంకరం ఉత్సాహంగా ఆనంద్‌ని చేతితోపొడుస్తూ.

వరండా ఓ ప్రక్కనున్న పెద్దగది తెరలు తొలగించు కుంటూ ఇద్దరు వ్యక్తులు వరండాలోనికి వచ్చారు. వారు స్పష్టంగా కన్పిస్తున్నారు ఇద్దరికీ.

"ఆమే భుజంగరావు భార్య!" శంకరం చెప్పాడు.

"మరి అతడు?" ఆనంద్ ప్రశ్న.

"ఈ ఊళ్ళో నాలుగు సినిమా థియేటర్ల ఏకైక యజ మాని పురుషోత్తమరావు!'

"ఆఁ!" అమితాశ్చర్యంతో నిండిపోయిన ఆనంద రావు మరి మాట్లాడలేక పోయాడు.

అతడు వెళ్ళిపోయాడు. ఆమె క్రిందికిచూస్తూ చెయ్యి వూపి లోపలికి వెళ్ళిపోయింది. కారు ఆ గేటు దాటి బయ టకు వచ్చి, శంకరం ఆనంద్‌ల ముందునుంచే దూసుకు పోయింది. కారె డ్రైవర్ నడుపుతున్నాడు. వెనకసీటులో మత్తుగా కళ్ళుమూసుకొని వున్నాడు, పురుషోత్తమరావు.

"అయితే డ్రైవర్లకూ, నౌకర్లకూ అందరికీ తెలిసిన్న భాగోతమేనన్నమాట?" ఆనంద్ ఆశ్చర్యం.

"ఆహా! రహస్యం దేనికీ? వాళ్ళకు బాగా టిప్స్ దొరికే ఇళ్లు అటువంటివే. వదలమన్నా వదలరుగా ఆ ఇళ్ళని నౌకర్లు?"

"ఈ కార్లోనే భుజంగం తిరుగుతుంటాడు కదూ?"

"ఓ! ఏం? అతడికి తెల్సిన సంగతేగా? లేకపోతే ఈ ఇల్లూ, ఆ హోటలూ ఎలా వచ్చాయనుకున్నావ్? నాలు గేళ్ళనాడు కట్టుగుడ్డలతో పొట్ట చేతపట్టుకుని ఓ సినిమా హాలులో గుమాస్తాగా పనిచేయటానికొచ్చాడీవూరు...... ఈ పురుషోత్తమరావే కాదులే. ఇంకో ఇద్దరు ముగ్గురు భాగ్యవంతులకు పరిచయముంది ఈ ఇంటితో!"

మనసంతా అసహ్యంతో నిండిపోగా ఆనందరావు ఏమీ మాట్లాడలేదు. "పద" అన్నాడు స్కూటరు స్టార్టు చేస్తూ.

"వుండు వుండు. ఒక్కసారి ఇక్కడ ఆపుజెయ్యి." దారిలో ఒకచోట ఆపుజేయించాడు స్కూటర్ని. అది కాస్మాపాలిటన్ క్లబ్.

"ఎందుకూ?"

"ఇక్కడుండొచ్చు భుజంగం. ఇక్కడ సాధారణంగా జేరుతుంటాడు".

"నువ్వు తర్వాతవెళ్దువుగాని. నన్నుపోనిద్దూ." విసుగ్గా వుంది ఆనంద్ ధోరణి.

"ఏమిటోయ్, ఈ మాత్రానికే కళ్ళుతిరిగాయా?"

"ఛీ ఛీ. కళ్ళుతిరగటం కాదు, సర్వసహ్యాం వేస్తోంది. ఇంత హీనగతి బ్రతుకులు బ్రతకటంకంటె చావరాదూ?

అటువంటి కులంలో పుట్టి అంతకంటె దారిలేక పతనమై జీవించే స్త్రీలను అందరూ అసహ్యించుకుంటారు. పెద్దమనిషి బురఖాలతో ఈ వెధవలు చేస్తున్నదానికంటె అది వెయ్యి రెట్లు నయం. "మా వృత్తి ఇదే - మేం ఇందుకే పుట్టాం" అంటూ ధైర్యంగా చెప్పి బ్రతుకున్నారు వాళ్ళు" ఆవేశం చిందులాడిం దతడి కంఠంలో.

"అంతా తెలిసీ ఎందుకతడిచుట్టూ మీరంతా తిరుగుతూన్నట్టు?" నిలదీసినట్టే అడిగాడు ఆనంద్ తిరిగి.

శంకరం ఈ ప్రశ్నకేమంత సిగ్గుపడలేదు. "మనదేం పోయిందీ? శ్రమపడకుండా వచ్చేడబ్బుగనుక వాళ్ళు విచ్చలవిడిగా విరజిమ్ముకు తిరుగుతారు; ఎప్పుడూ నలుగురు వాళ్ళ చుట్టూ వుంటేనే చాలనుకుంటారు. మనదేం పోయిందీ? మనకి కాస్త పైపై ఖర్చులు చెల్లిపోతుంటాయి."

శంకరం, సోమేశ్వరం వగైరా బృదం పేకాటలో పెట్టే డబ్బు లెక్కడివో, గోల్డ్ ఫ్లేకులూ, సినిమాలూ ఎలా లభిస్తున్నాయో ఆ క్షణంలో అర్థమైంది ఆనందరావుకు. "పై ఖర్చులూ చెల్లిపోవచ్చును. అడపా తడపా ఓ ఛాన్సు నీకూ తగలొచ్చు. అసలు నీ తాపత్రయం అదనుకొంటా" కసిగా అన్నాడు.

"కావచ్చు. తప్పేముందీ? మగవాళ్ళం!" సిగ్గుపడక పోగా ధీమాగా అన్నాడు. "అయినా, ఈ రోజుల్లో నీలాగా మడిగట్టుకునేవాళ్ళని నేనెక్కడా చూడలేదు. సంతోషించటానికీ అనుభవించటానికే పుట్టాం! అదే నేటి నినాదం. పాతకాలపువాడివి నువ్వు."

"పోనీయ్. ఏదో కాలపువాడిని. నాచేత వాగించకు. నన్ను పోనియ్ ప్రస్తుతానికి."

కాని అంత తేలిగ్గా పోనిచ్చే స్వభావం కాదు జలగ వంటి శంకరానిది. ఆనంద్ భుజం మీద చెయ్యి వేస్తూ అన్నాడు. "బ్రదర్! ఎవతో ఏదో చేస్తూంటే మధ్య నువ్వెందుకోయ్ ఇంత బాధపడ్తావ్? ఆ మొగుడికే లేనిబాధ నీకేమిటీ? వాడింట్లో పురుషోత్తం, వాడేమో వెంకట్రావు ఇంట్లో ఆ వెంకట్రావేమో..."

"ప్లీజ్, శంకరం. అపు చెయ్యి ప్లీజ్ స్నేహంగా తిరుగుతూ చాటున ఇలా విమర్శించడం స్నేహధర్మం కాదు. కుసుమతో అంత చక్కగా మాట్లాడ్తావ్! ఆమెను కూడా విమర్శిస్తున్నావా?"

శంకరం కళ్ళు గర్వంతో తళుక్కునమెరిశాయి. "ఏం, పతివ్రత అనమంటావా? నేను అనలేను— నాకు బాగా తెలుసు కాబట్టే! నేనే..."

"ఛీ ఛీ. చెప్పి చెప్పి నా మనసూ చెవులూ పాడు చెయ్యకు." స్కూటర్ స్టార్టు చేస్తూండగా భుజంగం కారు దూసుకువచ్చి ఆగింది. అతడు దిగగానే అందులోవున్న ఇద్దరాడవాళ్ళూ ఓ వెకిలి నవ్వు నవ్వి వీడ్కోలు చెప్పారు. భుజంగం చేయి ఊపాడు.

"వీళ్ళు వీడి అప్సరసలు. 'కాల్ గర్ల్స్' లే హోటల్ కి." రహస్యంగా చెప్పాడు శంకరం.

అంతలో భుజంగం దృష్టి వారిమీదనే పడింది. "ఓ ఆనందరావుగారూ? నమస్కారం. రండి రండి!" ఎక్కడ

లేని ఆప్యాయతతో పలుకరించి, భుజాన చేయివేసి వెయ్యేళ్ళ అనుబంధ మేదో వున్నట్లుగా లోనికి తీసుకుపోయాడు. ఇక అతనికి మాట్లాడే అవకాశమే ఈయకుండా. అప్పటికే బాగా త్రాగివున్నట్లు అతడి వాలకమే చెబుతోంది.

భుజంగాన్నిచూస్తూనే బేరర్ షాంపేన్ తీసుకొచ్చాడు "ఎప్పుడో నూటికీ కోటికీ తప్ప అసలు కన్పించనే కన్పించ రేమిటీ మీరు?" ఓ గ్లాసు ఆనంద్ చేతికి అందిస్తూ ప్రేమగా అడిగాడు.

"నన్నూ తనచుట్టూ తిరిగే గ్రహంలా మార్చాలని వేస్తున్నాడు ఎత్తులు!" అనుకుంటూ పైకి ప్రకాశంగా అన్నాడు. 'థాంక్స్ కాని ఇప్పుడు వద్దు. ఎక్స్‌క్యూజ్ మీ' గ్లాసు అందుకోలేదు.

"వ్హాట్!" లోకం తలక్రిందులైనంత ఆశ్చర్యంప్రకటించాడు భుజంగం. 'ఏం? ఏమిటి అభ్యంతరం?' ఎక్కడ లేని ప్రేమా కురిపించుతూ అడిగాడు.

"ఏంలేదు. నేను వెళ్ళాలి. కొంత అర్జంటు పని వున్నది."

"తెల్సులేవోయ్ నీ అర్జంటు పనేమిటో?" భుజంగం ఇవ్వకుండానే తానే ఓగ్లాసు అందుకుని ఖాళీచేస్తూ అన్నాడు శంకరం. "ఇంటిదగ్గర శ్రీమతిగారు ఆర్భాటంచేస్తారు. అందు కేనా?" అంటూ భుజంగంతో అన్నాడు. 'అబ్బే, మనం ఎంత ప్రయత్నించినా మనలో జేరడండీ బాబూ! బొత్తిగా ప్రవరాఖ్యుడు.'

అంతవరకూ చాటున అనేక విధాల విమర్శించినవాడు

ఇప్పుడు భుజంగాన్ని మించి ప్రపంచం లేనట్లుగా అతనికి ఒదిగి ఒదిగి మాట్లాడుతున్నాడు శంకరం.

ఊసరవెల్లి రంగులు మార్చనిదే బ్రతకలేదుకదా!

"ఏమిటి?" అప్పటికే రెండు గ్లాసులు ఖాళీ చేసి మూడో గ్లాసు చేతబట్టిన భుజంగం మొదలుపెట్టాడు. 'మీ ... మీ శ్రీమతి దెబ్బలాడతారా మీరు ఆలిస్యంగా వెళ్తే" నాలుక వంకర తిరుగుతోంది. మాటలు కష్టంగా ఉచ్చరిస్తున్నాడు.

"అబ్బెబ్బె, అదేంకాదు. శంకరం ఏదో వాగుతాడు"

శంకరం కూడా వాగటం ప్రారంభించాడు.

"నాకు తెల్సులేవోయ్. నేను నీలాగ ఎప్పుడూ పెళ్లానికి భయపడను. ఏం— నీ డబ్బుతో తాగానా, నీ బాబు డబ్బుతో తాగానా అని అడుగుతాను. తంతాను!"

అక్కడినుంచి సాధ్యమైనంత త్వరగా బయట పడాలని వుంది ఆనంద్‌కు "మరోసారి కల్సుకుంటాను లెండి." నమస్కారం పెట్టి చరచరా పోబోయాడు. కానీ భుజంగంచెయ్యి అతడిని భల్లూకంలా పట్టుకుంది. "పో బ్రదర్ పో, వద్దనను. పోయి చల్లగా బ్రతుకు!" ఏకవచనంలోకి దిగిపోయింది భాష. "ఓ మాట చెప్పనా? నీకంత మాంచి పెళ్లాం వున్నందుకు యాంగ్జయ్యాడ్వకు. సంతోషించు."

ఈ అభినందన ఎందుకో అర్థంకాలేదు ఆనంద్‌కు అది కూడా త్రాగుడు తీవ్రతే అనుకున్నాడు.

"అర్థంకాలేదా బ్రదర్?" ఎంతో నెమ్మదిగా అడిగాడు భుజంగం ఆనందరావు కళ్ళల్లో కళ్ళుంచి.

ముఖం తిప్పుకున్నాడు ఆనంద్. శంకరం ఈగోడ వేమీ పట్టనట్టే వీధి కుక్కకు దొంగతిండి దొరికితే ఎంత ఆబగా తింటుందో — అంత ఆత్రంగా గ్లాసులు ఖాళీచేసేస్తున్నాడు అదేధ్యాసగా. భుజంగం ధోరణి మారిపోయింది. మెల్లగా ఏడుపులోకి దిగాడు.

"ఇంతవరకూ ఎక్కడున్నావ్, ఏంచేస్తున్నావ్ అని పోట్లాడే భార్య వుంటంకంటే ఏంకావాలి? చూడూ-ఆమెని తలుచుకుంటూ నువ్వు తాగలేకుండా వున్నావు. చెడుఅనేది నీ దగ్గరకి రావటంలేదు. చెడు నీ దగ్గరకు జేరటంల్లేదు!"

త్రాగుడుమైకంలోనే తెలివైన మాటలు? అది పిచ్చి ప్రేలాపనకాదు! ఆశ్చర్యంగా వినసాగాడు ఆనంద్.

"నగలు తెమ్మనీ, కార్లూ మేడలూ కావాలనీ నిన్ను వేధించుకు తినదు నిన్ను. సుబ్బరంగా వేళకు ఇల్లుజేరుకుని సుఖపడమంటుంది. కానీ నిన్ను బయటికితోలేసి తనమానాన తాను కులకదు. నువ్వు ఆలస్యం చేస్తే అనుమానిస్తుంది. ఆర్భాటం చేస్తుంది, అసూయ పడ్తుంది. ఈ అసూయ లేని ఆడది ఆడదేకాదు. మగవాడిని ఆబోతులాగా ఊరిమీదికి వదిలేసే భార్య పెద్ద నేరస్తురాలు. సంఘ విద్రోహిని." అతడి గొంతు క్రమంగా పెరుగుతోంది.

"నాన్సెన్స్!" డిస్ట్రిబెన్స్ భరించలేని శంకరం గ్లాసు బల్లపై కొట్టాడు. అది ముక్కలయ్యింది పెద్ద శబ్దంతో.

భుజంగానికి ఆవేశం వచ్చింది. "అంతే అంతే." అంటూ పకపక నవ్వాడు ఏకంగా గ్లాసులూ, సీసాలూవున్న టేబుల్ నే తిరగద్రోశాడు. ఒక్కసారి అన్నీ భళ్ళున బ్రద్ద

లవ్వడం చూచి చప్పట్లుకొడుతూ వికటహాసం చేయసాగాడు. "ఇంతే, ఇల్లూ ఇల్లాలూ లేని మన బ్రతుకు లింతే. ఇలాగే బ్రద్దలౌతా యొకనాడు!" అంటూ ఈ హంగామాలో అతడు ఆనంద్ చేతిని వదిలేశాడు. 'బ్రతుకుజీవుడా' అనుకొంటూ పారిపోయాడు ఆనందరావు.

"అది ఒళ్ళుతెలియనితనం కాదు. అతడిలో స్వీయ జీవితంపట్ల అసహ్యత పెరుగుతోందన్నమాట! అంతర్యుద్ధం చెలరేగుతుందన్నమాట!" ఆశ్చర్యంగా తలపోయసాగాడు ఆనంద్ దారిపొడవునా.

శ్యామలలో తాను గుర్తించని విలువను ఈనాడు ఓ త్రాగుబోతు విశదంగా చూపించి కళ్ళు తెరిపించాడు! భుజంగం, వెంకట్రావు, శంకరం... ఒక్కొక్కరే కదలిపోతున్నారు అతడి దృష్టిపథంలో.

వీరిలో ప్రతి ఒక్కడికీ ఇల్లూ, సంసారమూ అన్నీ వున్నాయి. కాని అదికేవలం నామకార్థమే. లోకులదృష్టిలో మాత్రమే! కాని ఆ ఇల్లు నిజానికి వాడిది కాదు! ఇల్లాలు వాడికోసం ఎదురుచూడదు! ప్రతి మానవుడూ 'నా ఇల్లు-నా ఇల్లాలు, నా సంసారం' అని ధీమాగా చెప్పుకోలేరన్న మాట! కొందరికే ఆ అదృష్టం! లోకంలో ఎక్కడ లభించినా లభించకపోయినా ఎవడి ఇంటిలో వాడికి ఆదరణా ప్రశాంతతా లభిస్తుందనుకొనే వాడిన్నాళ్ళూ. అదిసరి కాదు. ఆ కనీసపు అదృష్టానికైనా నోచుకోని దౌర్భాగ్యు లెందరో ఈ ప్రపంచంలో. ఇంకా తనకి తెలియని నిజాలెన్నో.

# 9

నరక చతుర్దశి. ఆనాడే దీపావళి అన్నంత సంబరంగా వున్నారు పిల్లలు ఎక్కడికక్కడే. తెల్లవారకుండానే 'ఢాం ఢాం' మంటూ మొదలయ్యాయి శబ్దాలు.

ఆ శబ్దాలకు బద్ధకంగా కళ్ళు తెరిచాడు ఆనంద్. 'శ్యామల లేచి అప్పుడే పనుల్లో పడినట్లుంది' అనుకొన్నాడు ప్రక్కన ఖాళీమంచం చూచి. సుధీర్ ఇంకా నిద్రపోతున్నాడు. ఆ శబ్దాలకు ఉలికిపడ్తూంటే ఆనంద్ అటు ఒత్తిగిల్లి చెయ్యి బిడ్డమీదవేసి పడుకున్నాడు జడుసుకోకుండా నని.

పదినిముషాలు గడిచాయి. శ్యామల వచ్చి భర్త లేచిన విషయం చూచి వెళ్ళింది. రెండునిముషాలలో కాఫీ తీసుకువచ్చింది, ముభావంగా అందిస్తూన్న ఆమె ముఖంలోకి చూచి నవ్వాడు ఆనంద్. శ్యామల నవ్వలేదు, మాట్లాడ లేదు. ఏదో పనివున్నట్టు వెళ్ళిపోబోయింది, 'వెళ్దూగాని, కాస్సేపు ఇలా కూర్చోవోయ్.' అన్నాడు సరసంగా.

"ఇప్పుడే సూర్యోదయమైంది. ఇది ఉదయపు వేళ. నాకిది సరసాలకీ సరదాలకీ సమయం కాదు" అంటూ గిరుక్కునతిరిగి బయటకు వెళ్ళిపోయింది.

నవ్వుకున్నాడు ఆనంద్ లోలోన. గతరాత్రి ప్రొద్దుపోయి ఇల్లుజేరుకొన్నాడన్న కోపంతో ఆమె ధుమ ధుమ లాడ్తోందని అతడు గ్రహించాడు. ఆ వెనువెంటనే గుర్తు

వచ్చాడు, భార్యామణి ఘుమఘుమలకు క్రొత్త నిర్వచనమూ కొంగ్రొత్త అర్థాలూ బోధించిన భుజంగం.

"అమ్మగారూ, ప్రమిదలు వచ్చాయి పిలమంటారా?" వీధిలో ముగ్గుపెత్తూన్న పనిమనిషి లోపలికి ఓ కేకపెట్టింది.

"అక్కర్లేదులే, వెళ్ళమను." శ్యామల సమాధానం విసుగ్గావుంది. రమ ఎందుకో మారాంచేస్తోంది.

"అమ్మా పాలు!" పాలమనిషి కేకపెడ్తోంది.

"వస్తున్నా."

"అబ్బ శ్యామల నిజంగా అష్టావధానం — కాదు శతావధానం చేస్తోంది" అన్పించింది అంతా వింటూన్న ఆనందరావుకు. "ప్రొద్దున్నే పనివాళ్ళ గిన్నెలూ-చీపుళ్ళూ చప్పుళ్ళూ, పాలమనిషి కేకలు, కూరలమనుషుల అరుపులూ, పిల్లల ఏడ్పులూ- అబ్బబ్బ! రణగొణధ్వని! ఇది ఇల్లుకాదు, అని చికాకుపడే ఆనంద్‌కు ఇవ్వాళ కొంగ్రొత్త అర్థాలతో తియ్యగా - ఆనందంగా కన్పట్టుతోంది గృహ వాతావరణం. మామూలు రణగొణధ్వని ఈరోజు శ్రావ్యగానమైతోచింది. "ఆహా! నాది స్వర్గధామమైన సంసారం. నా ఇల్లాలు సుగుణ శీల." అనుకొన్నకొలదీ అతడు ఏదో మహారాజ్యాన్ని పొం దిన చక్రవర్తిలాగా గర్వపడసాగాడు.

మరో పావుగంట గడిచింది. సుధీర్ నిద్ర లేచాడు. పొట్టమీద కూర్చోబెట్టుకుని కబుర్లు చెప్తున్నాడు ఆనంద్.

"అమ్మగారూ, పువ్వులు! చామంతులూ, సంపెం గలూ, సన్నజాజులూ ఏ వివ్వను?"

"ఏమీ అక్కర్లేదులే, వెళ్ళిరా."

"అదేంటండమ్మా," పువ్వుల కుర్రాడు నీరసంగా అంటున్నాడు. "రోజూ తీసుకోవడం మానేశారు. పండగ నాడుకూడా వద్దనేస్తన్రు. బోణీచేస్తారని ముందు మీదగ్గరకే వచ్చినాను!"

లేచి వెళ్ళాడు - ఆనంద్.

"ఇయ్యవోయి ఇయ్యి. తెల్లచామంతులు యాభై, సంపంగి ఓ డజనూ, ఓ సన్నజాజుల మాలా - అన్నీ ఇయ్యి" అంటూ తానే ఫర్మాయించాడు! నాలుగురూపాయలిచ్చి చిల్లర ఈయబోతే తీసుకోలేదు. మహారాజునిలాగా చూచి సలాంకొట్టి వెళ్ళిపోయాడు వాడు.

"ఏమిటి, అమ్మగారు ప్రొద్దున్నే కోపంగా వున్నారు? పువ్వులూ, ప్రమిదలూ ఏవీ తీసుకోవేం?" అన్నాడు పూలు అందిస్తూ.

"ఎందుకివన్నీ?" అంటూ నిర్లిప్తంగా అలమారాలో వుంచేసింది శ్యామల, ఓ చేతితో రమను ఎత్తుకుని సముదాయిస్తూ.

"ఏం కావాలమ్మా?" లాలనగా అడిగాడు ఆనంద్.

"ఇరుగూ పొరుగూ అందరిపిల్లలూ టపాసులు కాలుస్తున్నారు. చూచి ఏడుస్తోంది తనకీకావాలని." నిష్ఠూరంగా అన్నది శ్యామల. "మీకేమో కాస్త ఇలాంటి చిన్న చిన్న బజారు పనులకికూడా టైము దొరకడంలేదు."

"బాగుంది! ఏదీ— ఇప్పుడేగా నువ్వు నాకు చెప్తున్నావ్ కొనమనీ?"

"ఇదంతా భాగుంది. పిల్లలకు ఇటువంటివి కొనిపెట్టా

లనీ కూడా మీకు నేను చెప్పాలన్నమాట!"

"అపరాధమే. ఏం శిక్షవేస్తావో వెయ్యి." అంటూ రమను ఎత్తుకుని బుజ్జగించాడు. "దా, స్నానంచేసి మనం అన్నీ కొని తెచ్చుకుందాం."

రమ ఊరడిల్లింది తాత్కాలికంగా.

పిల్లలకు పాలుపట్టి, స్నానాదులైన తర్వాత వంట ప్రయత్నంలో పడింది శ్యామల.

"అబ్బ, కొంచెం ఆ జడవేసుకుని పువ్వులు పెట్టుకో రామా, పనులు తర్వాత చేసుకోవచ్చు. అంత ప్రేమగా నీ కోసం నేను కొన్నానా మరి?"

"అమ్మా ప్రమిదలండీ!" వీధిలోంచి మరో కేక.

"అక్కర్లేదని చెప్పమ్మా రమా."

"ఏం, ఎందుకొద్దూ?" ఆనంద్ ప్రశ్న.

శ్యామల మరి నిగ్రహించుకోలేకపోయింది. 'ఎందుకూ మీరెక్కడికో వెళ్ళిపోతారుగా పిక్నిక్ లూ అవీ ఇవీ అని? ఇక నాకు పువ్వులతో ముస్తాబుదేనికీ, ప్రమిదలతో జ్యోతులతో ఇల్లు అలంకరించడం దేనికీ ఎవరికోసం?" కళ్ళనుంచి అశ్రువులు జలజలా రాలసాగాయి.

నీరైపోయాడు ఆనంద్. "ఛ, ఏమిటిది ప్రొద్దున్నే?" దగ్గరగా వెళ్ళి కళ్లు తుడుస్తూ అన్నాడు. "నే వెళ్ళడంలేదే, నువ్వు రానన్నావుగా?"

నమ్మనట్లు చూచింది శ్యామల.

"నిజం శ్యామలా, వెళ్ళడంలేదు. ఇంట్లోనేవుంటాను. దీపావళినాడు ఇంట్లోవుండక ఎవరైనా బయటికి పోతారా?"

ఈ యింటి అలంకరణా, ఇల్లాలి ముస్తాబూ నాకోసమే. 'కేవలం నాకోసం!' గర్వంతో నాట్యమాడిం దతడి అంత రంగం.

"ఇప్పుడే ఈ మాటలన్నీ, ఎవళ్ళన్నా వస్తే తుర్రు మంటారు మళ్ళీ."

"లేదు, నిజం."

అంతలో హాల్లోంచి పరిచయమైన స్త్రీకంఠం విన వచ్చింది: 'ఆనందరావుగారూ' అంటూ.

"ఎవరబ్బా ఆడవాళ్ళు ఆయన్ని పిలుస్తున్నారూ పేరు పెట్టి మరీనీ?" కుతూహలంగా చూసింది శ్యామల.

ఆ వచ్చినామె కుసుమ!

శ్యామల ప్రసన్న హృదయం తిరిగి ముకుళించుకు పోయింది. 'పిక్నిక్‌కు రమ్మని పిలవటానికొచ్చింది కాబోలు!' అనుకున్నది కసిగా. మర్యాదకైనా ఆమె హాల్లోకి వెళ్ళి కుసుమను పలకరించలేదు.

కుసుమ తెచ్చిన వార్తవిని ఆనంద్ నిర్విణ్ణుడయ్యాడు. ఆ అర్ధరాత్రి ఊరిచివర ఓ ట్రావెలర్స్ బంగళాలో భుజంగం హత్యచేయబడ్డాడు. పిస్టల్ గుళ్ళున్నాయి అతడి శరీరంలో. వివాదకారణం ఒక స్త్రీ కావచ్చుననీ, హత్యచేసిన వ్యక్తి పరారీలో వున్నాడనీ అప్పుడే ఒక స్థానిక దినపత్రిక హెడ్ లైన్స్‌తో ప్రచురించేసింది.

"వెంకట్రావు నిన్న సాయంత్రం నుంచీ ఇల్లు జేరుకో లేదు" అదీ కుసుమ గాబరా.

"ఇప్పుడేంచేయడం?" కుసుమ ఆదుర్దాగా అడిగింది.

"చేసేదంతా ఇక చేయవలసినవాళ్ళే చేస్తారు. మన చేతిలో ఏమీలేదు." అసహ్యంగా అన్నాడు ఆనందరావు.

"అంతేనంటారా?" దీనంగా చూచింది.

"అంతే మరి. అయినా నావల్ల ఏమౌతుంది? వెంకట్రావుకూ, భుజంగానికీ మీకూ మంచి స్నేహితులైన శంకరం, సోమేశ్వరం అందరూ వున్నారుగా? వాళ్ళతో మాట్లాడండి మీరు."

కుసుమ మాట్లాడలేదు.

"ఇంతకీ భుజంగం టీబీలో ఎందుకున్నట్లో?" తనలో తాను అనుకున్నాడు.

"వాళ్ళకవి మామూలే లెండి. ఏదో ఊరు వెళ్తామనీ మర్నాడు మధ్యాహ్నానికొచ్చేస్తామనీ ఇళ్ళల్లో చెప్తారు. ఆ బంగళా కాపలావాడికి చేతిలో ఏదో పెట్టి..."

మిగిలింది అర్థమైంది అతనికి.

"వెంకట్రావుకీ వుందా ఆ అలవాటు?"

కుసుమ తల ఒంచుకుంది మాట్లాడలేదు.

"సరే, నేనేం చేయలేను. ఎవరైనా పెద్ద ప్లీడరు దగ్గర కెళ్ళండి." ఖచ్చితంగా చెప్పేసి వదిలించుకున్నాడు.

వాళ్లంతా ఎంత ప్రమాదకరమైన వ్యక్తులో తెలిసిన కొలదీ అతడికి అసహ్యం కలగడమే కాక, వారికి దూరంగా వుండమని మనస్సు ప్రబోధిస్తూన్నది. రాత్రి భుజంగంవాగ్ధోరణీ, ఏడుపూ ఒక్కటొక్కటే గుర్తుకువచ్చి 'పూర్ ఫెలో' అనుకున్నాడు.

కుసుమ వెళ్లిపోయింది.

"ఎందుకొచ్చింది?" తీక్షణంగా అడిగింది శ్యామల.

అసలు సంగతి చెప్పలేదు ఆనంద్. చెప్పితే 'పండగ నాడు ఏమిటీ పాపిష్టి వార్త, అంటూ ఇల్లంతా కడిగి, అందర్నీ స్నానంచేయించి, తాను చేయనిదే వదలిపెట్టనంత సనాతనురాలామె.'

"పిక్నిక్ కోసమే. మనం రామని చెప్పేశాను." చిన్న అబద్ధం ఆడక తప్పలేదు. 'కాస్త మర్యాదకైనా బయటి కొచ్చి పలకరించావు కాదేమిటి?'

"ఛ, అటువంటిదానికి ఎందుకు మర్యాదలు?" ఛీత్కరించింది. "ఇంటికొచ్చింది గనుక, అంతే. అయినా అంత అసూయ ఎందుకునీకూ?" వింటూనే కోపగించింది శ్యామల. "అసూయ అనకండి, సరీ సాటీ అయిన వాళ్లతో అసూయ లుండొచ్చు కానీ ఇటువంటి అల్పురాలిపై అసూయా, పోటీ ఏమిటి నాకు? అసహ్యం అంతే."

"అసహ్యమా, అనుమానమా ? నన్ననుమానించ డానికి నీకు సిగ్గులేదూ?"

"అనుమానమే, సిగ్గుదేనికీ? ఇది సిగ్గిలవసింది కాదు. ఏం, మీరు అనవసరంగా వాళ్ల ఇళ్లు పట్టుకొని తిరుగు తూంటే నా కనుమానం రాదూ? మిమ్మల్ని అనుమానించడం, అవసరమైతే సరిదిద్దడం భార్యగా నా డ్యూటీ, నా హక్కు కూడ, సిగ్గుపడక్కర్లేదు. స్త్రీలోగల ఈ స్వార్థమూ అసూయలవలనే మానవ ప్రపంచం నడుస్తోంది. సంసారాల కీలకం ఈ స్వార్థంలోనే వుంది, భర్త ప్రేమను పరాయిది దోచుకుంటుందేమోననే స్వార్థ ప్రేమపూరితమైన అసూయ-

ఇది ఒక్కటే హిందూకుటుంబాలకు ఈనాడు ఆయువుపట్టు. భర్తను ఎవరు దోచుకున్నా ఫర్వాలేదు, భర్త ఎలా తిరిగినా ఫర్వాలేదనుకొనేది ఆడదనిపించుకోదు నా దృష్టిలో. తన జీవిత సర్వస్వమైన పురుషుణ్ణి కాపాడుకోవాలనే తపన ఏ స్త్రీకుండదు?"

ఆలోచిస్తున్నాడు ఆనంద్. 'త్రాగుబోతు నోటినుండీ సంసారిణి నోటినుండీ ఒకే మాటలు; ఒకే నిర్వచనం! ఎంతాశ్చర్యం! మంచికి ఇంత విలువా?' దీపావళినాడు భర్త ఇంట వుండి సరదాగా ప్రవర్తిస్తున్నందుకు ఉప్పొంగిపోయింది శ్యామల. జ్యోతుల కాంతిలో కళకళలాడుతూన్న భార్య వదనాన్ని చూస్తూ తలపోశాడు ఆనంద్. 'చచ్చిపోయే ముందు ఇల్లూ - ఇల్లాలూ అనే పదాలలో గల మధురతనూ మహనీయతనూ నాకు విడమర్చి చెప్పిపోయావు భుజంగం! ప్రజల దృష్టిలో నీవు పాపివైనా, హీనపుచావు చచ్చినవాడవైనా ఆ హైన్యతమాటున గల నీ దీనచరిత్రా, ఆత్మక్షోభా నాకు తెలుసు. ఈ దీపావళికే కాదు, ప్రతి దీపావళికీ నిన్ను తలచుకొని నీ ఆత్మశాంతికోసం ప్రార్థిస్తాను."